మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 10-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 342 Issue: 342

10 జూన్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:46 తిథి దశమి రా. 12:53౦ వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర ఉ. 9:09 వరకు తరువాత రేవతి యోగం ఆయుష్మాన్ ఉ. 6:28 వరకు కరణం వనిజ మ. 1:46 వరకు విష్టి రా. 12:53౦ వరకు వర్జ్యం రా. 8:48 నుండి రా. 10:20 వరకు దుర్ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:41 వరకు రాహుకాలం మ. 12:15 నుండి మ. 1:53 వరకు యమగండం ఉ. 7:22 నుండి ఉ. 9:00 వరకు గుళికాకాలం ఉ. 10:37 నుండి మ. 12:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు తె. 4:35 నుండి ఉ. 6:10 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial

www.evarthalu.com



## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ

### క్రిమినల్ కేసు నేపథ్యంలో ఈసీ నిర్ణయం

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్‌కు షాక్ తగిలింది. ఆమె రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైంది. తెలంగాణలో క్రిమినల్ కేసులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించలేదని, ఆస్తుల వివరాలు తెలపలేదని ఎలక్షన్ కమిషన్‌కు బీజేపీ ఫిర్యాదు చేసింది. దీంతో నామినేషన్‌ను ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. కాగా, మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సభ్యత్వానికి నామినేషన్ వేశారు.

హైదరాబాద్, జూన్ 9 (ఈవార్తలు): ఆ రాష్ట్ర అసెంబ్లీలో మొత్తంగా 230 స్థానాలుండగా, బీజేపీకి సొంతంగా 165 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు 64 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. గెలవడానికి సుమారు 58 ఓట్లు అవసరం. అయితే కాంగ్రెస్ ఓట్లతో సులువుగా ఒక రాజ్యసభ సీటు గెలువగలదు. బీజేపీ వద్ద మరో 49 ఓట్లు మిగులుతాయి. ఒకవేళ బీజేపీ మూడో అభ్యర్థిని బరిలోకి దింపితే విజయానికి 9 ఓట్లు ప్రతిపక్షం నుంచి రావాల్సి ఉంటుంది. ఈ ఉత్కంఠల నడుమ 'పార్టీ ఆదేశిస్తే మూడో అభ్యర్థిని గెలిపించగలం' అని బీజేపీ సీనియర్ మంత్రి కైలాశ్ విజయవర్గీయ కామెంట్ చేశారు. దీంతో కాంగ్రెస్‌ను క్రాస్ ఓటింగ్ భయం వెంటాడింది. ఈ నేపథ్యంలో ఆమె అభ్యర్థిత్వం రద్దవడం సంచలనంగా మారింది.

### కేసు ముచ్చట చెప్పిందే టీ కాంగ్రెసోళ్లు!: కైలాశ్ వర్గీయ

భోపాల్: మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురవడంపై మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి కైలాశ్ విజయ్ వర్గీయ బాంబు పేల్చారు. అసలు మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో కేసులు ఉన్నాయనే విషయం తమకు తరువాయి 2 వ పేజీలో...



# అమాస గోలె బడికి పోవుడా?

### ఈ నెల 15న విద్యాసంవత్సర ప్రారంభం

### ఆ రోజే అమావాస్య కావడంతో తల్లిదండ్రుల అభ్యంతరం

### ప్రభుత్వం ఆ మాత్రం ఆలోచించదా? అని విమర్శలు

పిల్లలను మొదటిసారి బడికి పంపే ముందు అక్షరాభ్యాసం చేయించడం, శ్రీకారం చుట్టించడం తెలుగు సమాజంలో చిరకాలంగా వస్తున్న ఆచారం. విద్యారంభాన్ని ఒక శుభకార్యంగా భావించే తల్లిదండ్రులు విజయదశమి, వసంతపంచమి వంటి శుభదినాల్లోనే అక్షరాభ్యాసం నిర్వహిస్తుంటారు. అలాంటి సమాజంలో లక్షల మంది విద్యార్థుల కొత్త విద్యా సంవత్సర ప్రారంభానికి అమావాస్య రోజును ఎంచుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న తలెత్తుతోంది. ఒక చిన్నారి తొలిసారి పుస్తకం పట్టినా, పెన్సిల్ పట్టినా ముహూర్తం చూసే కుటుంబాలు ఉన్నాయి.

ఇంట్లో కొత్త పని ప్రారంభించాలన్నా, పిల్లల చదువుకు శ్రీకారం చుట్టాలన్నా పంచాంగం పరిశీలించే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. అలాంటప్పుడు వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు తిరిగి పాఠశాల గడప తొక్కే తొలి రోజే అమావాస్య కావడం పట్ల సహజంగానే తల్లిదండ్రుల్లో సందేహాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

(ఈవార్తలు స్పెషల్ డెస్క్)

తెలంగాణలో కొత్త విద్యా సంవత్సరానికి ప్రభుత్వం జూన్ 15 తేదీని నిర్ణయించింది. అయితే ఆ రోజు అమావాస్య కావడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో అనేక కుటుంబాలు ఇప్పటికీ శుభాశుభాలను విశ్వసిస్తూ ముఖ్యమైన కార్యక్రమాలను ముహూర్తాలు చూసి నిర్వహిస్తుంటాయి. అలాంటి పరిస్థితుల్లో పిల్లల విద్యా ప్రయాణానికి తొలి రోజే అమావాస్య రావడం పట్ల కొందరు తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల విషయానికి వస్తే, కొత్త



## పెగ్గుతోనే కిక్కు!

### రాష్ట్రంలో విస్కీ అమ్మకాలే అధికం.. మద్యం అమ్మకాల్లో 85 శాతం విస్కీదే

హైదరాబాద్, జూన్ 9 (ఈవార్తలు): తెలంగాణలో అమ్ముడు అవుతున్న ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌లో విస్కీ వాటా ఏకంగా 84.89 శాతం ఉన్నట్లు వెల్లడైంది. దీంతో దేశంలోనే అత్యంత ఎక్కువ విస్కీ విక్రయించే రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటిగా నిలిచింది. ఇది కర్ణాటకలో 76.50 శాతం, తరువాయి 2 వ పేజీలో...




# కోటి.. ఇది నా ఒట్టు!

### మహిళలను కోటీశ్వరులను చేసేదాకా విశ్రమించను.. పరేడ్ గ్రౌండ్స్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేసిన సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మహిళాశక్తి సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు. 'ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు.

సికింద్రాబాద్, జూన్ 9 (ఈవార్తలు): వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తిపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుంది. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్‌దే. బీజేపీ తన పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు తరువాయి 2 వ పేజీలో...



## పీవోకే రక్తసిక్తం

### 30 మందిని ఊచకోత

### పాక్ బలగాల దుశ్చర్య

### 200 మందికి గాయాలు

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా దళాలు ఫైరింగ్‌కు పాల్పడ్డాయి. ఈ ఘటనలో సుమారు 30 మంది మృతిచెందగా, మరో 200 మంది గాయపడ్డారు. పాకిస్థాన్ నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్న ఆందోళనకారులపై భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. రావల్‌కోట్, బింబేర్, ముజాఫరాబాద్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. పాక్ దళాలు చాలా క్రూరంగా ఫైరింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. టియర్ గ్యాస్‌తోనూ నిరసనకారుల్ని చెదరగొట్టారు. జాయింట్ అవామీ యాక్షన్-2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,316 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,410 |




## భారత్‌లో స్టార్‌లింక్‌కు బ్రేక్

న్యూయార్క్/న్యూఢిల్లీ: భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభించే ప్రయత్నాల్లో ఉన్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు భారత ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఇరాన్ యుద్ధంలో స్టార్‌లింక్ టెర్మినల్స్ వాడకంపై వెలువడిన నివేదికల -2 వ పేజీలో...

## విశ్వవాణి



2026 ఫిఫా ప్రపంచ కప్‌కు ముందు, నార్వే జాతీయ జట్టు విడుదల చేసిన అధికారిక ఫోటో షూట్ ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతోంది. ప్రముఖ స్టార్లు ఎర్లింగ్ హాలాండ్, మార్టిన్ ఒడెగార్డ్‌లతో సహా ఆటగాళ్లందరూ రాజసంతో.. సముద్రం ఒడ్డున హెల్మెట్‌లు, కత్తులతో ఫోటో దిగారు. ప్రముఖ ఫోటోగ్రాఫర్ డేవిడ్ యారో రూపొందించిన ఈ కాన్సెప్ట్‌కు "ది వైకింగ్స్ ఆర్ కమింగ్" అని పేరు పెట్టారు. 1998 తర్వాత నార్వే జట్టు మళ్లీ మొదటిసారి ప్రపంచ కప్‌లోకి పునరాగమనంగా ఇలా చేశారు. దీంతో ఇప్పటివరకు వచ్చిన అత్యుత్తమ టీమ్ ఫొటో అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

### నైరుతి ఆగమనం..

## హైదరాబాద్ ఆగమాగం!


### రాజధానిలో భారీగా వర్షం.. సైబరాబాద్ స్టక్

### గంటలకొద్దీ నిలిచిన ట్రాఫిక్.. ప్రయాణికుల ఇబ్బందులు

జోగులాంబ గద్వాల జిల్లా ద్వారా నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించాయి. నైరుతి రాకతో జోగులాంబ గద్వాల జిల్లాతోపాటు దాని పరిసర ప్రాంతాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆకాశంలో మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది.

హైదరాబాద్, జూన్ 9 (ఈవార్తలు): సిద్దిపేట, జనగామ, హనుమకొండ, సిరిసిల్ల, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ మెదక్, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, ఖమ్మం, కరీంనగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, నల్లగొండ, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 15 మిల్లీమీటర్ల





## 3 కిలోల బంగారం.. 200 కోట్ల ఆస్తులు!

### ఆర్అండ్‌బీ ఈఎన్సీ అవినీతి చిట్టా.. 11 ప్రాంతాల్లో 16 బృందాలుగా ఏసీబీ తనిఖీలు

హైదరాబాద్, జూన్ 9 (ఈవార్తలు): హైదరాబాద్ మాదాపూర్‌లోని రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇళ్లు, ఆఫీసుల్లో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో.. మోహన్ నాయక్ ఇంటితోపాటు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల నివాసాలు కలిపి.. 11 ఇతర ప్రాంతాల్లో ఏకంగా 16 ఏసీబీ టీంలు ఒకేసారి తనిఖీలు నిర్వహించాయి. తెల్లవారుజామునే తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా డబ్బు, బంగారం, మద్యం బాటిళ్లు దొరికినట్లు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

10.6.2026

మేషం: అవసరానికి సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారములు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యలను తెలివిగా పరిష్కరించుకుంటారు.

వృషభం: ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితులతో వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు కలసిరావు.

మిధునం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన ఋణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగ ప్రయత్నాలలో అవరోధాలు తొలగుతాయి.

కర్కాటకం: సంఘంలో పెద్దలతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఉద్యోగస్తుల జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశములు లభిస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలలో సమస్యలు అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

సింహం: వ్యాపారాలలో స్వంత ఆలోచనలు అంతగా కలసిరావు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. మిత్రులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. చేపట్టిన వ్యవహారాలు మధ్యలో నిలిచిపోతాయి. వృత్తి ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

కన్య: చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. నూతన ఋణ యత్నాలు కొంత కష్టంతో పూర్తి అవుతాయి. బందు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. దూరపు బంధువుల నుండి కీలక విషయాలు తెలుస్తాయి. వ్యాపార వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. వృత్తి ఉద్యోగాలు కొంత నిదానంగా సాగుతాయి.

తుల: భూ క్రయవిక్రయాలలో విశేషమైన లాభాలు అందుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. కుటుంబ పెద్దలతో గృహమున సందడిగా గడుపుతారు. బంధు మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి,ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

వృశ్చికం: ఆప్తులతో దీర్ఘకాలిక వివాదాలు తీరి ఊరట చెందుతారు. అనుకున్న సమయానికి పనులు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. సమాజంలో గౌరవ మర్యాదలు విస్తృతమౌతాయి. వృత్తి ఉద్యోగ విషయంలో ఉన్న సమస్యలు అధిగమిస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి. సంతాన విద్యా విషయాలు నిరుత్సాహపరుస్తాయి. ఆర్థిక వ్యవహారాలు కొంత చికాకు పరుస్తాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

మకరం: ముఖ్యమైన వ్యవహారాలలో కొంత జాప్యం కలుగుతుంది. ఋణ దాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. బంధువుల నుండి అందిన ఒక వార్త నిరుత్సాహం కలిగిస్తుంది.

కుంభం: బంధు మిత్రుల సహాయ సహకారాలు అందుతాయి. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు కుదురుతాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆత్మీయులతో కీలక విషయాల గురించి చర్చిస్తారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యల నుంచి అధికారుల సహాయంతో బయటపడతారు.

మీనం: సంతాన ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అంచనాలు అందుకోవడంలో సమస్యలు తప్పవు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఋణ సంబంధిత సమస్యలు వలన ఒత్తిడి తప్పదు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.






# కోటి.. ఇది నా ఒట్టు!

మొదటి పేజీ తరువాయి

ఇచ్చారా? బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదు. మా ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చాం. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు. ఆడ బిడ్డలు ఉచితంగా బస్సులో పక్క ఊరు వెళ్లి చదువుకుంటున్నారు. ఫ్రీ బస్సు వల్ల ఆడపిల్లల డ్రాప్‌అవుట్స్ తగ్గాయి. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తాం. హైటెక్‌సిటీ పక్కన రూ.వెయ్యికోట్ల భూమిని మహిళా సంఘాలకు ఇచ్చాం. రాష్ట్ర ఆర్థిక ప్రగతి మహిళల చేతుల్లోనే ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలను ఏనాడైనా మహిళలు కట్టుకున్నారా? మా ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకొనే మహిళలు ఈ సభకు వచ్చారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేవరకు విశ్రమించను. 2034 వరకు మీ ఆశీర్వాదంతో ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తాం' అన్నారు.

## మీనాక్షి నామినేషన్ తిరస్కరణ

మొదటి పేజీ తరువాయి

తెలియనే తెలియదని అన్నారు. తమకు సమాచారం ఇచ్చింది తెలంగాణ కాంగ్రెస్ నేతలేనని.. అక్కడి నుంచే చిట్టీ అందిందంటూ కుండబద్ధలు కొట్టారు. తెలంగాణలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇక అర్థం చేసుకోండి ఆ పార్టీ వ్యవహారం ఎలా ఉందో..! అని పేర్కొన్నారు.

## భారత్‌లో స్టార్‌లింక్‌కు బ్రేక్

మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో, భారత హోం శాఖ పరిధిలోని భద్రతా సంస్థలు స్టార్‌లింక్ ప్రయోగానికి అవసరమైన తుది అనుమతులను హోల్డ్‌లో పెట్టేసింది. ఇరాన్‌లో స్టార్‌లింక్‌కు ఎలాంటి అధికారిక లైసెన్స్ లేకపోయినా, పశ్చిమాసియా యుద్ధ సమయంలో ఈ సేవలను వాడటం కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేసింది. భవిష్యత్తులో ఏదైనా అంతర్జాతీయ ఉద్రిక్తతలు వచ్చినప్పుడు అమెరికా యాజమాన్యంలో ఉన్న ఒక విదేశీ నెట్‌వర్క్‌ను మన దేశం ఎలా కంట్రోల్ చేయగలదనే భయం భారత అధికారుల్లో పెరిగింది. దీనివల్ల స్టార్‌లింక్ దాదాపు ఏడాది క్రితమే 'గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్' లైసెన్స్ సాధించి, ముంబైలో ఒక మెయిన్ హబ్‌తో పాటు 10 గేట్‌వేలను సిద్ధం చేసుకున్నప్పటికీ.. జాతీయ భద్రతకు సంబంధించిన అన్ని అంశాలపై స్పష్టత వచ్చే వరకు సేవలకు అనుమతి ఇవ్వబోమని కేంద్రం తేల్చిచెప్పినట్లు సమాచారం.

## ఆగమాగం!

మొదటి పేజీ తరువాయి

నుంచి 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశముందని పేర్కొన్నారు. అటు.. మంగళవారం హైదరాబాద్ వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కుండపోత వర్షం ధాటికినగరంలోని అమీన్‌పూర్, రాయ్‌దుర్గ్, ఖైరతాబాద్, కూకట్ పల్లి, లింగంపల్లి, మియాపూర్, ముషీరాబాద్, లక్డీకాపూర్, సరూర్ నగర్, కోఠి, అబిడ్స్, బషీర్ బాగ్, హిమాయత్ నగర్, ట్యాంక్ బండ్, నారాయణగూడతోపాటు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షంతో చాలా చోట్ల ట్రాఫిక్ స్తంభించి రాకపోకలు నిలిచిపోయాయి. సైబరాబాద్ మొత్తం గంటల తరబడి ట్రాఫిక్‌తో స్తంభించిపోయింది.

## పీవోకే రక్తసిక్తం

మొదటి పేజీ తరువాయి

కమిటీ(జేఏఏసీ) అనే సంస్థ ఇచ్చిన ఆందోళన మేరకు జనం నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆర్థిక, రాజకీయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఓ ఆస్పత్రి మార్చురీ వద్ద భారీ సంఖ్యలో జేఏఏసీ కమిటీ మద్దతుదారులు చేరుకున్నారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో గ్రూపులోని కొందరు ఆటోమెటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులను వాడారు. జూలై 27వ తేదీన జరగనున్న ప్రాంతీయ ఎన్నికల్లో శరణార్థులకు 12 సీట్లు కేటాయించరాదు అని జేఏఏసీ పేర్కొన్నది.

# పెగ్గుతోనే కిక్కు!

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో 55 శాతం మాత్రమే ఉంది. మరోవైపు.. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ బ్రాండీ వినియోగమే ఎక్కువగా ఉండటం గమనార్హం. హైదరాబాద్‌లోని ఐటీ, సర్వీస్ సెక్టార్ ఉద్యోగుల్లో పెరుగుతున్న డిమాండ్ కారణంగా బ్రీజర్ల వాటా 3.32 శాతంగా నమోదైనట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. తెలంగాణలో మీడియం, ప్రీమియం విస్కీ బ్రాండ్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. మొత్తం విస్కీ అమ్మకాల్లో 45.9 శాతం క్వార్టర్ రూ.170 నుంచి రూ.260 మధ్య ధర కలిగిన బాటిళ్లే ఉండటం గమనార్హం. ఇక రూ.110 ధర కలిగిన క్వార్టర్ల వాటా 22.69 శాతం ఉండగా.. రూ.140-160 ధరల విస్కీలు 21.07 శాతం అమ్మకాలు అయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో రూ.270-రూ.350 ధరల ప్రీమియం విస్కీల వాటా 6.54 శాతం కాగా.. రూ.350 కంటే ఎక్కువ ధర కలిగిన ప్రీమియం బ్రాండ్ల వాటా 3.8 శాతంగా ఉంది. తెలంగాణలో అమ్ముడయ్యే ప్రతీ 10 ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ బాటిళ్లలో దాదాపు 9 బాటిళ్లు విస్కీయే కావడం విశేషం. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌లో విస్కీ తర్వాత బ్రాండీ నిలిచింది. బ్రాండీ వాటా కేవలం 9.21 శాతం మాత్రమే ఉంది. ఆ తర్వాత వోడ్కా 1.24 శాతం, వైన్ 0.88 శాతం, రమ్ 0.32 శాతం, జిన్ 0.09 శాతం, లిక్యూర్ 0.04 శాతం, టెకిలా కేవలం 0.01 శాతం మాత్రమే వాటాను కలిగి ఉన్నాయి. ఒకప్పుడు దక్షిణ భారత రాష్ట్రాల్లో బ్రాండీకి భారీగా డిమాండ్ ఉండేది. అయితే తెలంగాణలో ప్రస్తుతం అది భారీగా తగ్గిపోయింది. బ్రాండీ విభాగంలో కూడా రూ.150 నుంచి రూ.200 మధ్య ధరల ఉత్పత్తులే 63.99 శాతం అమ్మకాలను సాధిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణ లో బీర్ అమ్మకాల్లో కూడా కీలక మార్పులు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు స్ట్రాంగ్ బీర్‌కు ఎక్కువ ఆదరణ ఉండగా.. ప్రస్తుతం లైట్ బీర్ వైపు మందుబాబులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తం బీర్ అమ్మకాలలో లైట్ బీర్లు 55.97 శాతం ఉండగా.. 44.03 శాతం స్ట్రాంగ్ బీర్ల వాటా నమోదైంది. మార్కెట్ వర్గాల ప్రకారం.. తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాల వైపు యువత మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది.

# అమాస గోలె బడికి పోవుడా?

మొదటి పేజీ తరువాయి

భవనాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనుల ప్రారంభాలు వంటి సందర్భాల్లో శుభ ముహూర్తాలకు ప్రాధాన్యం ఇచ్చే రాజకీయ నాయకులు, అధికారులు.. లక్షల మంది విద్యార్థుల జీవితాలకు సంబంధించిన పాఠశాలల ప్రారంభ తేదీ విషయంలో ఈ సున్నిత అంశాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అమావాస్య రోజున కొత్త పనులు ప్రారంభించకూడదనే నమ్మకం బలంగా ఉంది. దీంతో కొంతమంది తల్లిదండ్రులు తొలి రోజు పిల్లలను పాఠశాలకు పంపడంలో సంకోచం వ్యక్తం చేసే అవకాశం ఉందని విద్యావేత్తలు కూడా అభిప్రాయపడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే హాజరు శాతం ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. విద్య అంటే కేవలం పాఠ్యాంశాలు మాత్రమే కాదు. అది సమాజ భావోద్వేగాలతో, సంస్కృతితో ముడిపడి ఉంటుంది. ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ ఒక రోజు ముందో, వెనుకో తేదీ నిర్ణయించి ఉంటే ఈ వివాదానికి అవకాశం ఉండేది కాదని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ప్రభుత్వ నిర్ణయాలు శాస్త్రీయ దృక్పథం, పరిపాలనా అవసరాల ఆధారంగానే ఉండాలని కొందరు వాదిస్తున్నారు. క్యాలెండర్, సెలవులు, విద్యా కార్యక్రమాల ప్రణాళిక వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని తేదీలు నిర్ణయిస్తారని వారు చెబుతున్నారు.అయినప్పటికీ, ప్రజల విశ్వాసాలు, సామాజిక భావోద్వేగాలు కూడా పరిపాలనలో భాగమే. ముఖ్యంగా పిల్లల విద్యకు సంబంధించిన అంశాల్లో ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవడం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమావాస్యపై విశ్వాసం ఉన్న కుటుంబాల ఆందోళనలను ప్రభుత్వం ముందుగానే గుర్తించి, తగిన విధంగా నిర్ణయం తీసుకొని ఉంటే ఈ చిక్కు వచ్చేది కాదని పలువురు పేర్కొంటున్నారు.

# 3 కిలోల బంగారం.. 200 కోట్ల ఆస్తులు!

మొదటి పేజీ తరువాయి

ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రూ.60 లక్షల నగదు, 3 కిలోల బంగారం, 35 మద్యం సీసాలు, భారీగా ఆస్తి పత్రాలు లభించినట్లు వెల్లడించారు. అందులో 15 బంగారు బిస్కెట్లు కూడా ఉన్నట్లు తెలిపారు. వీటితోపాటు హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో రూ.కోట్ల విలువైన వ్యవసాయ భూములు ఉన్నాయని.. వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పేపర్లను కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మోహన్ నాయక్ అక్రమాస్తులపై 16 ఏసీబీ బృందాలు తనిఖీలు చేస్తున్నాయని వివరించారు. 2025 సెప్టెంబర్‌లో ఆర్ అండ్ బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)గా మోహన్ నాయక్ పదవిలోకి వచ్చారు. అంతకుముందు స్టేట్ రోడ్స్ చీఫ్ ఇంజినీర్‌గా, ఆర్డీసీ (రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఎండీగా మోహన్ నాయక్ పలు విభాగాల్లో విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం మోహన్ నాయక్‌కు ఈఎన్సీగా ప్రమోషన్ ఇచ్చింది. అయితే.. ఆర్ అండ్ బీ ఈఎన్‌సీగా బాధ్యతలు చేపట్టి సంవత్సరం కూడా గడవకముందే మోహన్ నాయక్‌పై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఏకకాలంలో చాలా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి.. మోహన్ నాయక్ అవినీతి చిట్టాను బయటికి తీశారు. తన హోదాను అడ్డం పెట్టుకుని ఆర్‌అండ్‌బీ శాఖలో టెండర్లు, కాంట్రాక్టుల కేటాయింపుల్లో మోహన్ నాయక్ భారీ ఎత్తున అవినీతి చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల రూపంలో భారీగా





డబ్బులు తీసుకున్నట్లు చాలా రోజులుగా ఆరోపణలు ఉన్నట్లు డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. మోహన్ నాయక్ ఆర్థిక లావాదేవీలపై రహస్య నిఘా పెట్టి.. పక్కా సమాచారంతోనే దాడులు చేసినట్లు పేర్కొన్నారు.



## ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాలా?

**వెంటనే సిట్ ఏర్పాటు చేయండి**

**రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆగ్రహం**

హైదరాబాద్, జూన్ 9 (ఈవార్తలు): ప్రభుత్వ భూములకు నకిలీపట్టాల సృష్టిపై సిట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఖానామెట్ భూములకు నకిలీ పట్టాలు సృష్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ భూమి తనదంటూ పిటిషన్ దాఖలు చేసిన ఇట్టిగా ప్రాపర్టీస్‌కు రూ.5లక్షల జరిమానా విధించింది. నకిలీ పట్టాల వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్రపైనా సీఐడీ దర్యాప్తునకు ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఐపీఎస్ అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని జస్టిస్ నగేశ్ భీమపాక ఆదేశాలు ఇచ్చారు. గతంలో టీజీఐఐసీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ ఇట్టిగా ప్రాపర్టీస్ అనే సంస్థ హైకోర్టులో సవాల్ చేసింది. ఖానామెట్‌లో 15 ఎకరాలను కొనుగోలు చేశామని పిటిషన్ వేసింది. అయితే, ఖానామెట్‌లో ఈ భూమిని 1997లోనే టీజీఐఐసీకి ప్రభుత్వం కేటాయించడం గమనార్హం.



# వానలోనూ మహిళలకు బస్సుల పంపిణీ

## హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా శక్తి సభ

### వర్షంలో తడుస్తూనే వేదికపైకి సీఎం రేవంత్, మంత్రులు.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సుల పంపిణీ

సికింద్రాబాద్, జూన్ 9 (ఈవార్తలు): హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కార్యక్రమాలను కొనసాగించారు. మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'మహిళా శక్తి' మహాసభలో ఆయన పాల్గొన్నారు. కుండపోత వర్షంలోనూ తన సహచర మంత్రులతో కలిసి వేదికపైకి చేరుకున్న ముఖ్యమంత్రి, మహిళా స్వయం సహాయక సంఘాల కోసం కేటాయించిన 553 కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. సభ జరుగుతున్న సమయంలో నగరంలో భారీ వర్షం కురిసింది. అయినప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆయన జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన హైర్ ఛార్జీల చెక్కులను పంపిణీ చేశారు. 'ఇందిరా మహిళా శక్తి' వంటి వినూత్న పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పథకంలో భాగంగా మహిళా సంఘాలు కొనుగోలు చేసిన బస్సులను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు (టీఎస్ఆర్టీసీ) లీజు ప్రాతిపదికన అందజేస్తారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## రైతు భరోసా వద్దని 2 నెలలు తిరిగా

**జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**

**కౌలు రైతులపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచన**

హైదరాబాద్, జూన్ 9 (ఈవార్తలు): సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి.. రైతులు, వ్యవసాయం, కౌలు రైతులను ఉద్దేశించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. పంట పండించే రైతుకు మాత్రమే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు, ఫలాలు అందాలని హితవు పలికారు. భూమి ఉన్న ప్రతీ వ్యక్తికి కాకుండా.. పేద, కౌలు రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ క్రమంలోనే నిజంగా భూమిని సాగు చేసి.. పంట పండించే రైతులకు మాత్రమే.. వ్యవసాయ సబ్సిడీలు, ఎరువులు, రుణాలు, ఇన్సూరెన్స్ సౌకర్యం, మద్దతు ధర వంటి సౌకర్యాలను కల్పించాలని జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి ప్రభుత్వాలకు కీలక సూచన చేశారు. కౌలు రైతుల సమస్యలపై హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి.. రైతులు, వ్యవసాయంపై కీలక ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని గుర్తు చేసిన ఆయన.. ఈ సమస్యపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించాలని పేర్కొన్నారు. తాను సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేసి రిటైర్ అయ్యానని.. తనకు ప్రతీ నెల పెన్షన్ వస్తుందని గుర్తు చేశారు. అంతేకాకుండా తాను సంపాదించిన ఆదాయానికి ఇన్‌కమ్ ట్యాక్స్ కూడా చెల్లిస్తానని.. తాను నివసించేందుకు ఇల్లు కూడా ఉందని.. అయినప్పటికీ తనకు రైతు భరోసా పథకం కింద డబ్బులు వచ్చేవని గుర్తు చేసుకున్నారు. అయితే ఆ రైతు భరోసా డబ్బులు తనకు వద్దని, వాటిని వదిలించుకునేందుకు సంబంధిత అధికారుల చుట్టూ రెండు నెలల పాటు తిరిగినట్లు జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. అన్నీ ఉన్న తనకు రైతు భరోసా డబ్బులు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఒక పక్క రైతు భరోసా డబ్బులు రాలేదని రైతులు వాపోతున్నారని.. తానేమో రైతు భరోసా డబ్బులు వద్దని వెళ్లడంతో అధికారులు తలలు పట్టుకున్నారని తెలిపారు. రూల్స్ అలాగే ఉన్నాయని.. తామేమీ చేయలేమని మొదట అధికారులు చెప్పారని.. కానీ తాను ఒత్తిడి తీసుకురావడంతో.. ఎలాగోలా తన పేరును రైతు భరోసా లబ్ధిదారుల జాబితా నుంచి తీసేయించుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గతంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన రేవంత్ రెడ్డి.. కౌలు రైతులకు ఇచ్చిన హామీతో పాటు వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. రికార్డుల్లో కాలం నంబర్ 16 గతంలో అమల్లో ఉందని.. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే ఆ కాలం నంబర్ 16ను తొలగించారని పేర్కొన్న ఆయన.. దాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కౌలు రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు.



## గోదావరి ప్రక్షాళనకు కేంద్రం భారీ నిధులు

విజయవాడ, జూన్ 9 (ఈవార్తలు): గోదావరి నదిని కాలుష్యం నుంచి కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని ఏపీ బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. నది ప్రక్షాళన కోసం కేంద్రం ఏడాదికి రూ.400 కోట్ల చొప్పున నిధులు ప్రకటించిందని, అందులో ఇప్పటికే రూ.100 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. రాబోయే గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలోని 290 గ్రామాలను అభివృద్ధి చేయాల్సి ఉందన్న ఆయన.. మునికూడలిలో ఘాట్ నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతోందని తెలిపారు. ఇదే సమయంలో, గోదావరి నది కాలుష్యంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించిన తీరును సోము వీర్రాజు అభినందించారు. నదిని కాలుష్య కోరల నుంచి కాపాడేందుకు ఆంధ్ర పేపర్ మిల్లుతో పాటు రాజమండ్రి నగరపాలక సంస్థ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పవన్ ఆదేశించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో పేపర్ మిల్లు కాలుష్యంపై ఎవరు మాట్లాడినా బ్లాక్‌మెయిల్ చేస్తారనే వాదన ఉండేదని, కానీ ఒక డైనమిక్ లీడర్‌గా పవన్ కల్యాణ్ ఆ అడ్డంకులను అధిగమించి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలు అందిస్తున్న నరేంద్ర మోదీ పాలన స్ఫూర్తితోనే ఈ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని సోము వీర్రాజు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్రధాని మోదీ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# దమ్ముంటే చర్చకు రా

**రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్**



హైదరాబాద్, జూన్ 9 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. "కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని" అని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్తూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం" అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్–2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# రోజుకు 18 గంటలు కష్టపడుతున్నం

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**




వరంగల్, జూన్ 9 (ఈవార్తలు): తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే... హరీష్ రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. "రాష్ట్ర క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తుంటే.. హరీష్ రావు నిత్యం అబద్ధాలు చెబుతున్నారు" అని భట్టి విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుని, దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరి నాడు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ విజయాలను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే 76,000 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిందని, రైతులకు అండగా నిలుస్తూ తడిసిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రుణమాఫీ పథకాన్ని నిలకడగా అమలు చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దేవాదుల ప్రాజెక్టును తాము వేగవంతం చేశామన్నారు. గత ప్రభుత్వం డిస్కమ్‌లకు బకాయిలు పెట్టడం వల్లే విద్యుత్ సమస్యలు వచ్చాయని, తాము ఆ బకాయిలను చెల్లిస్తూ విద్యుత్ సరఫరాను మెరుగుపరిచామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని చెప్పారు. రఘునాథపల్లిలో 230 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

## ప్రాజెక్టులు రేవంత్ ఏటీఎంలు

**టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు**



భువనగిరి, జూన్ 9 (ఈవార్తలు): తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు.





# 13న పాఠశాలల్లో 'స్వచ్ఛత'

**కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు**

కరీంనగర్, జూన్ 9 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వచ్ఛ పాఠశాల పేరుతో తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న అన్ని ప్రభుత్వ స్కూళ్లను పరిశుభ్రం చేసే కార్యక్రమానికి రెడీ అయ్యారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో ఉన్న అన్ని గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛత పనులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే కరీంనగర్ బీజేపీ కార్యకర్తలకు తాజాగా కీలక విజ్ఞప్తి చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానుండగా.. ఈనెల 13వ తేదీన పాఠశాలలను పరిశుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని చైతన్యపురిలో కరీంనగర్ నియోజకవర్గంలోని జిల్లాల అధ్యక్షులు, మండల అధ్యక్షులతో బండి సంజయ్ మంగళవారం రోజున సమావేశమై.. నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. పాఠశాలలు ప్రారంభం నేపథ్యంలో వాటన్నింటినీ పరిశుభ్రం చేసి సుందరంగా ముస్తాబు చేయాలని హితవు పలికారు. ఇందుకోసం బుధవారం మండలాల వారీగా పార్టీ కార్యకర్తలు సమావేశమై ఒక్కో పాఠశాలకు ఒక్కో ఇంఛార్జ్‌లను నియమించాలని సూచించారు. ఈనెల 11వ తేదీన టిఫిన్ బైఠక్ పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించి.. ఈ స్వచ్ఛ పాఠశాలకు సంబంధించి సూచనలు చేయనున్నట్లు బండి సంజయ్ తెలిపారు. ప్రతి స్కూల్‌లో ఎన్ని తరగతి గదులు ఉంటాయో ముందే లెక్కించి.. ఒక్కో గదికి ఇద్దరు చొప్పున బీజేపీ కార్యకర్తలను కేటాయించాలని పేర్కొన్నారు. అవసరమైతే చీపురు, ఇతర వస్తువులను వెంట తీసుకెళ్లి.. తరగతి గదులను శుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. శుభ్రం చేయడంతోపాటు పాఠశాలలను సుందరంగా ముస్తాబు చేయాలని తెలిపారు.

# రైళ్లలోనే వంట

**గ్యాస్ కొరతతో ఐఆర్‌సీటీసీ నిర్ణయం**

**ఇండక్షన్ కుక్కర్ల వినియోగానికి అనుమతి**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడటంతో, భారతీయ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. చాలా ఏళ్ల క్రితం నిలిపివేసిన విధానాన్ని పునరుద్ధరిస్తూ, కదులుతున్న రైళ్లలోనే వంట చేసేందుకు అనుమతి ఇచ్చింది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా గ్యాస్ స్టవ్‌లకు బదులుగా ఎలక్ట్రిక్ ఇండక్షన్ స్టవ్‌లను ఉపయోగించనున్నారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో భారత్‌కు ఎల్‌పీజీ దిగుమతులు తగ్గాయి. ప్రభుత్వం గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో, రైల్వేలు, హోటళ్లు వంటి వాణిజ్య వినియోగదారులకు సిలిండర్ల లభ్యత కష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఐఆర్‌సీటీసీ ఈ నిర్ణయం తీసుకుంది. రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్ వంటి ప్రీమియం రైళ్లలోని ఎల్‌హెచ్‌బీ ప్యాంట్రీ కార్లలో ఇండక్షన్ స్టవ్‌లపై వంట చేసేందుకు వెండర్లకు అనుమతి ఇచ్చినట్లు ఐఆర్‌సీటీసీ ఛైర్మన్, ఎండీ సంజయ్ కుమార్ జైన్ తెలిపారు. రైల్వే నెట్‌వర్క్ వ్యాప్తంగా రోజుకు సుమారు 1.7 మిలియన్ల మందికి భోజనాలు అందుతుండగా, దీనికి 1000 కమర్షియల్ సిలిండర్లు అవసరమవుతాయి. కొరతను అధిగమించేందుకు, రైల్వే కిచెన్లలో ఇప్పటికే 60 శాతం వంటను విద్యుత్ ఆధారిత పద్ధతులకు మార్చారు. స్టేషన్లలోని ఫుడ్ ప్లాజాలు, రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లలో కూడా ఇండక్షన్, మైక్రోవేవ్‌లు వాడాలని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, దేశవ్యాప్తంగా 341 రైళ్లలో ఇప్పటికీ ప్యాంట్రీ కార్ల సౌకర్యం లేకపోవడం గమనార్హం.

# ఢిల్లీ అగ్నిప్రమాదం.. కుటుంబపెద్ద కూడా మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాద విషాదంలో మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తన కుటుంబ సభ్యులు ఎనిమిది మందిని కోల్పోయిన 80 ఏళ్ల రాధే శ్యామ్ అగర్వాల్, ఆ చేదు నిజం తెలియకుండానే మంగళవారం కన్నుమూశారు. దీంతో గురుగ్రామ్‌కు చెందిన అగర్వాల్ కుటుంబం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న రాధే శ్యామ్ అగర్వాల్ ఢిల్లీలోని సాకేత్ మాక్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను చూసుకునేందుకు గురుగ్రామ్‌లో నివసించే ఆయన కుమారుడు వివేక్ అగర్వాల్, కోడలు, మనవరాళ్లతో సహా మొత్తం ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఢిల్లీకి వచ్చారు. వీరంతా ఆసుపత్రికి సమీపంలోని మాల్వియా నగర్‌లో ఉన్న 'ఫ్లరిష్ స్టే' అనే హోటల్‌లో బస చేశారు. జూన్ 3న ఉదయం 8:30 గంటల సమయంలో ఆ హోటల్‌లోని వంటగదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వివేక్ అగర్వాల్ కుటుంబ సభ్యులు ఎనిమిది మందితో పాటు మొత్తం 21 మంది ప్రాణాలు కోల్పోయారు. తన కుటుంబానికి ఇంతటి ఘోరం జరిగిందన్న విషయం తెలియని రాధే శ్యామ్, తన వాళ్లెవరూ పలకరించడానికి రావడం లేదని ఆసుపత్రి సిబ్బందిని నిరంతరం ఆరా తీస్తుండేవారు. చివరకు ఆయన కూడా చికిత్స పొందుతూ మృతి చెందడంతో, ఆ కుటుంబంలో ఒక్కరు కూడా మిగలకుండా పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు, హోటల్ యజమాని లవకేశ్ బజాజ్, వంట మనిషి కేశవ్ నేగిని అరెస్ట్ చేశారు. భవన నిర్మాణం, అగ్నిమాపక భద్రతా నిబంధనల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ దుర్ఘటనతో గురుగ్రామ్‌లోని అగర్వాల్ కుటుంబ నివాసం మూగబోయింది.




# హెచ్‌డీఎఫ్‌సీ కీలక వడ్డీ రేట్ల పెంపు

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, తన ఖాతాదారులకు సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్ల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. సవరించిన ఈ కొత్త రేట్లు 2026 జూన్ 8 నుంచే అమల్లోకి వచ్చాయి. బ్యాంకు తీసుకున్న ఈ నిర్ణయంతో రుణాలు తీసుకున్న వారిపై అదనపు వడ్డీ భారం పడనుంది. బ్యాంకు వెల్లడించిన వివరాల ప్రకారం, చాలా వినియోగదారుల రుణాలకు ప్రామాణికంగా ఉండే ఏడాది కాలపరిమితి ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరిగి 8.40 శాతానికి చేరింది. రెండేళ్ల ఎంసీఎల్ఆర్ అత్యధికంగా 10 బేసిస్ పాయింట్లు పెరిగి 8.55 శాతానికి చేరుకుంది. అదేవిధంగా, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.35 శాతానికి, మూడేళ్ల ఎంసీఎల్ఆర్ 8.65 శాతానికి పెరిగాయి. మూడు నెలల ఎంసీఎల్ఆర్ లు కూడా 5 బేసిస్ పాయింట్ల చొప్పున పెరిగి వరుసగా 8.10 శాతం, 8.20 శాతం వద్ద స్థిరపడ్డాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవలే రెపో రేటును యథాతథంగా ఉంచినప్పటికీ, నిధుల సమీకరణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ పెంపును చేపట్టింది. ఈ నిర్ణయం వల్ల ఎంసీఎల్ఆర్ ఆధారిత గృహ, వాహన మరియు వ్యక్తిగత రుణాలు తీసుకున్న వారి నెలవారీ వాయిదాలు (ఈఎంఐలు) పెరిగే అవకాశం ఉంది లేదా రుణ కాలపరిమితి పొడిగించబడవచ్చు. రుణ రీసెట్ తేదీ వచ్చినప్పుడు మాత్రమే ఈ కొత్త వడ్డీ రేట్లు వర్తిస్తాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన అధికారిక వెబ్‌సైట్‌లో స్పష్టం చేసింది.

# డేటింగ్‌లో బిర్యానీ.. ఉద్యోగం ఊడింది

గురుగ్రామ్: స్టాండప్ కామెడీ షోలో సరదాగా చేసిన ఓ వ్యాఖ్య ఓ యువకుడి ఉద్యోగానికే ఎసరు పెట్టింది. రూ.370 బిర్యానీ గురించి చేసిన వివాదాస్పద వ్యాఖ్య సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, అతను పనిచేస్తున్న గురుగ్రామ్ కంపెనీ అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. ఈ ఘటన ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, హిమాన్షు జంగ్రా (22) అనే యువకుడు గురుగ్రామ్‌లోని 'స్టార్‌విక్ డిజైన్' అనే సంస్థలో పనిచేస్తున్నాడు. ఇటీవల అతను కమెడియన్ ప్రణీత్ మోర్ స్టాండప్ కామెడీ షోకు ప్రేక్షకుడిగా వెళ్లాడు. షోలో భాగంగా ఆ కమెడియన్‌తో హిమాన్షు మాట్లాడుతూ, తాను ఒక అమ్మాయితో డేట్‌కు వెళ్లానని, ఆమెతో కలిసి రూ.370 పెట్టి చికెన్ బిర్యానీ తిన్నానని చెప్పాడు. ఆ తర్వాత, పెట్టిన డబ్బులు వసూలు చేసుకోవాలి కదా ("వసూల్ తో కరుంగా") అనే అర్థం వచ్చేలా పరోక్ష వ్యాఖ్యలు చేశాడు. ఈ వ్యాఖ్య మహిళల పట్ల అగౌరవంగా, అంగీకారాన్ని చులకన చేసేలా ఉందని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హిమాన్షుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వివాదం ముదరడంతో హిమాన్షు క్షమాపణలు చెప్పి, తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను డీయాక్టివేట్ చేసుకున్నాడు. ఈ ఘటనపై స్పందించిన స్టార్‌విక్ డిజైన్ సంస్థ వ్యవస్థాపకుడు వివేక్ విశ్వకర్మ, హిమాన్షు వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, అవి తమ సంస్థ విలువలకి విరుద్ధమని తెలిపారు. ఆఫీసులో అతని ప్రవర్తనపై ఎటువంటి ఫిర్యాదులు లేనప్పటికీ, ఈ వ్యాఖ్యల ప్రభావం దృష్ట్యా అతడిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. షో సమయంలోనే ఈ వ్యాఖ్యను ఖండించనందుకు కమెడియన్ ప్రణీత్ మోర్ కూడా క్షమాపణలు చెప్పారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వస్తున్నాయి.




న్యూఢిల్లీ: దశాబ్దాలుగా అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాన్ని పక్కనబెట్టి భారత్ ఈ అడుగు వేయడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా శాంతి సమయాల్లో భారత్ తన అణు బాంబులను, వాటిని ప్రయోగించే క్షిపణులు లేదా యుద్ధ విమానాలను వేర్వేరు ప్రాంతాలలో భద్రపరుస్తుంది. కానీ ఇప్పుడు తొలిసారిగా అణుబాంబులను నేరుగా ప్రయోగించే వ్యవస్థలతో అనుసంధానించి, సైనిక స్థావరాల్లో లేదా భూగర్భ క్షిపణి కేంద్రాల్లో యుద్ధానికి సిద్ధంగా ఉంచినట్లు సిప్రి నివేదిక పేర్కొంది. జూన్ 8న విడుదలైన ఈ నివేదిక ప్రకారం.. జనవరి 2026 నాటికి భారతదేశం వద్ద ఉన్న మొత్తం అణు ఆయుధాల సంఖ్య దాదాపు 190కి చేరింది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య కొద్దిగా పెరిగింది. వీటిని భూమి, గగనతలం, సముద్రం.. ఈ మూడు మార్గాల ద్వారా ప్రయోగించేలా భారత్ తన సామర్థ్యాన్ని ఆధునికీకరించుకుంది. ముఖ్యంగా అణు జలాంతర్గాముల్లో ఈ సరికొత్త వ్యూహాత్మక అణుబాంబులను మోహరించి సముద్ర గర్భంలో నిరంతర నిఘా నిర్వహిస్తున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. క్షిపణులను ముందే కంటైనర్లలో సిద్ధంగా ఉంచే సాంకేతికతను భారత్ ఇటీవల అభివృద్ధి చేయడం వల్లే.. శాంతి సమయంలోనూ క్షిపణులతో అణుబాంబులను అనుసంధానించే ఈ విధానం సాధ్యపడిందని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. శత్రువుల నుంచి ముప్పు పొంచి ఉన్నప్పుడు అత్యంత వేగంగా స్పందించేందుకు ఈ వ్యూహం ఉపయోగపడుతుంది. అయితే అణ్వస్త్రాలను మోహరించినప్పటికీ భారత్ తన ప్రాథమిక సూత్రమైన 'నో ఫస్ట్ యూజ్' విధానానికే కట్టుబడి ఉందని నివేదిక స్పష్టం చేసింది. దీని ప్రకారం భారతదేశం ఏ దేశంపైనా మొదటగా అణు దాడి చేయదు. ఒకవేళ శత్రుదేశం భారత్‌పై గానీ, భారత బలగాలపై గానీ అణు దాడికి పాల్పడితే.. దానికి ప్రతీకారంగా మాత్రమే భారత్ తన అణు ఆయుధాలను ప్రయోగిస్తుంది. ఏ దేశంతోనూ ఆయుధాల పోటీ పడకుండా.. కేవలం శత్రువులను నిరోధించేందుకు మాత్రమే పరిమితమైన, అత్యంత ప్రభావవంతమైన అణు సామర్థ్యాన్ని భారత్ కలిగి ఉందని సిప్రి నివేదిక వెల్లడించింది.

# మమత ఇంట్లో సీఐడీ సోదాలు

కోల్‌కతా: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఎమ్మెల్యేలు, ఎంపీల తిరుగుబాటుతో ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో ఉన్న మమతా బెనర్జీకి మరో తలనొప్పి వచ్చిపడింది. శాసనసభ్యుల సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తులో భాగంగా ఆ రాష్ట్ర సీఐడీ అధికారులు మంగళవారం మమతా బెనర్జీ నివాసానికి చేరుకున్నారు. కోల్‌కతాలోని 30దీ, హరీశ్ ఛటర్జీ స్ట్రీట్‌లో ఉన్న ఆమె నివాసంలో సోదాలు నిర్వహించేందుకు సీఐడీ బృందం అక్కడకు వెళ్లడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆమె ఇంటి చిరునామాతో తృణమూల్ కాంగ్రెస్ అధికారిక పార్టీ కార్యాలయం కూడా నమోదై ఉన్నందున తాము ప్రాంగణాన్ని తనిఖీ చేయాల్సి ఉందని సీఐడీ అధికారులు పేర్కొన్నారు. అయితే, మాజీ ఎంపీ సుభాశిష్ చక్రవర్తితో సహా పలువురు టీఎంసీ నాయకులు అధికారులను లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో నివాసం వెలుపల కొంత సేపు తీవ్ర ఉద్రిక్తత, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. మమతా బెనర్జీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఇద్దరూ ప్రస్తుతం ఇంట్లో లేరని, కాబట్టి సోదాలకు అనుమతించలేమని, ఒకట్రెండు రోజుల తర్వాత రావాలని సుభాశిష్ చక్రవర్తి కోరారు. అయితే, దీనిపై సీఐడీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. తాము చట్టప్రకారం విచారణకు వస్తే అడ్డుకోవడం నేరమని స్పష్టం



చేశారు. కొద్దిసేపు ఘర్షణ తర్వాత సీఐడీ బృందం లోపలికి వెళ్లింది. మే 20న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్‌కు తృణమూల్ కాంగ్రెస్ తరఫున ఒక లేఖ సమర్పించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా సోవన్ దేబ్ ఛటోపాధ్యాయను ఎన్నుకుంటూ ఈ లేఖను ఇచ్చారు. అయితే ఈ లేఖపై ఉన్న తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ టీఎంసీ ఎమ్మెల్యేలు రితబ్రతా బెనర్జీ, సందీపన్ సాహా సంచలన ఆరోపణలు చేశారు. ఈ వివాదం ముదిరి ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఈ ఫోర్జరీ వ్యవహారంపై కోల్‌కతాలోని హేర్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కాగా బెంగాల్ ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. స్పీకర్‌కు పంపిన ఆ వివాదాస్పద లేఖపై పార్టీ జనరల్ సెక్రటరీ అభిషేక్ బెనర్జీ సంతకం చేసినందున, విచారణకు హాజరుకావాలంటూ సీఐడీ ఆయనకు పలుమార్లు సమన్లు జారీ చేసింది. అయితే, అనారోగ్య కారణాలను చూపుతూ అభిషేక్ బెనర్జీ వ్యక్తిగతంగా హాజరుకాకుండా.. తనకు 15 రోజుల సమయం కావాలని కోరారు. ఈ నేపథ్యంలోనే సీఐడీ నేరుగా మమతా బెనర్జీ ఇంటికి రావడం బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.



# విద్యార్థినికి ఎయిరిండియా రూ.74,131 పరిహారం

జైపూర్: విద్యార్థినికి చేరాల్సిన ప్రయోజనాలను నిరాకరించడంతో పాటు, రిఫండ్ చెల్లింపులో తీవ్ర జాప్యం చేసిన ఎయిరిండియా సంస్థపై రాజస్థాన్ వినియోగదారుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితురాలైన విద్యార్థినికి రూ. 74,131 పరిహారంగా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. జైపూర్‌కు చెందిన లావణ్య మాగోన్ అనే విద్యార్థిని యూకేలో విద్యాభ్యాసం పూర్తి చేసింది. 2021 జులైలో ఆమె లండన్ నుంచి భారత్‌కు వస్తున్న సమయంలో, అదనపు లగేజీ కోసం ఎయిరిండియా 350 బ్రిటిష్ పౌండ్లు (అప్పటి భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 34,131) వసూలు చేసింది. అంతర్జాతీయ విద్యార్థుల కోసం అమలు చేస్తున్న 'మహారాజా స్కాలర్ స్కీమ్' కింద తనకు అదనపు లగేజీ వెసులుబాటు ఉందని ఆమె వాదించినప్పటికీ, సిబ్బంది పట్టించుకోలేదు. అనంతరం లావణ్య పలుమార్లు ఎయిరిండియా యాజమాన్యాన్ని సంప్రదించగా, 2021 సెప్టెంబరులో ఆమె ఈ రాయితీకి అర్హురాలేనని సంస్థ అంగీకరించింది. రిఫండ్ నిమిత్తం బ్యాంకు వివరాలను సేకరించినప్పటికీ, నగదును మాత్రం ఖాతాలో జమ చేయలేదు. ఎయిరిండియా ధోరణితో విసిగిపోయిన బాధితురాలు చివరకు వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన జిల్లా కమిషన్, 2024 ఫిబ్రవరిలో రూ. 34,131 రిఫండ్‌తో పాటు, మానసిక క్షోభకు రూ. 4,000, న్యాయపరమైన ఖర్చుల కింద రూ. 3,000 చెల్లించాలని తీర్పునిచ్చింది. అయితే, తాను అనుభవించిన ఇబ్బందులతో పోలిస్తే ఈ పరిహారం చాలా తక్కువని భావించిన ఆమె, రాష్ట్ర కమిషన్‌లో అప్పీల్ చేశారు. కేసును పునఃసమీక్షించిన రాష్ట్ర కమిషన్, మానసిక వేదనకు ఇచ్చే పరిహారాన్ని రూ. 30,000కు, కేసు ఖర్చులను రూ. 10,000కు పెంచింది. దీంతో ఎయిరిండియా చెల్లించాల్సిన మొత్తం రూ. 74,131కి చేరింది. ఇటువంటి ఉదంతాల్లో కేవలం ఆర్థిక నష్టాన్ని మాత్రమే కాకుండా, బాధితులు ఎదుర్కొన్న వేధింపులు, మానసిక క్షోభను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కమిషన్ తన తీర్పులో స్పష్టం చేసింది.

# డస్టర్.. దుమ్ములేపే ఇంజిన్

**1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్.. అద్భుతమైన పర్ఫార్మెన్స్, మెరుగైన రైడ్**

ముంబై: రెనో డస్టర్ తన ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో మరోసారి తన సత్తా చాటుతోంది. కొత్త 1.0 లీటర్ టీసీఈ 100 టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో వచ్చిన ఈ మోడల్, డ్రైవింగ్ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. కేవలం ఫీచర్లకే పరిమితం కాకుండా, అద్భుతమైన డ్రైవింగ్ అనుభూతికి, రైడ్ కంఫర్ట్‌కు ప్రాధాన్యత ఇచ్చే వారికి ఇది ఒక సరైన ఎంపికగా నిలుస్తోంది. ఈ డస్టర్‌లో అమర్చిన 1.0-లీటర్ 3-సిలిండర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్ 100 హెచ్‌పీ శక్తిని, 166 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పరిమాణంలో చిన్న ఇంజిన్ అయినప్పటికీ దీని పనితీరు అద్భుతంగా ఉంది. సిటీ ట్రాఫిక్‌లో గానీ, హైవేలపై వేగంగా వెళ్లేటప్పుడు గానీ పవర్ డెలివరీ చాలా సాఫీగా, బలంగా అనిపిస్తుంది.



# ఇజ్రాయెల్‌లో శివాజీ విగ్రహం!

జెరూసలేం: మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఘనకీర్తి మరోసారి ప్రపంచవ్యాప్తం కానుంది. ఇజ్రాయెల్‌లో శివాజీ మహారాజ్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముంబైలోని ఆ దేశ కాన్సులేట్ జనరల్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా యూదులు శతాబ్దాలుగా హింసను ఎదుర్కొన్నప్పటికీ భారత్‌లో మాత్రం వారు ఎలాంటి వివక్ష లేకుండా సురక్షితంగా జీవించారనే చారిత్రక బంధానికి ప్రతీకగా ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కొంకణ్ తీర ప్రాంతంలో నివసించే 'బెనె ఇజ్రాయెల్' అనే యూదు సమాజానికి, మరాఠా సామ్రాజ్యానికి మధ్య 17వ శతాబ్దం నుంచే బలమైన సైనిక బంధం ఉంది. యూదుల యుద్ధ నైపుణ్యాలను, వారి పట్టుదలను గుర్తించిన శివాజీ మహారాజ్.. వారిని తన సైన్యంలో, నౌకాదళంలో కీలక పదవుల్లో నియమించారు. మరాఠా నావికాదళంలో 'ఆరోన్ చురికర్' అనే యూదు సైనికుడు నేవీ కమాండర్‌గా సేవలందించి శివాజీ మహారాజ్ చేతుల మీదుగా ఇనామ్ భూములను కూడా పొందడం విశేషం. ఈ యూదులు మహారాష్ట్ర సంస్కృతిని, మరాఠీ భాషను ఎంతగానో ఆదరించారు. శనివారాల్లో తమ మత ఆచారం ప్రకారం చమురు మిల్లుల పనికి సెలవు ప్రకటించడం వల్ల స్థానికులు వీరిని 'శనివార్ తేలీలు' అని పిలిచేవారు. ఆ తర్వాత కాలంలో ఈ బెనె ఇజ్రాయెల్ సైనికులు ఈస్ట్ ఇండియా కంపెనీ బాంబే ఆర్మీలోనూ చేరి.. ఆంగ్లో-మైసూర్, ఆంగ్లో-మరాఠా యుద్ధాల్లో తమ అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించి చరిత్ర పుటల్లో నిలిచారు. 1948లో ఇజ్రాయెల్ దేశం ఏర్పడిన తర్వాత భారత్ నుంచి వేలాది యూదు కుటుంబాలు అక్కడికి వలస వెళ్లాయి. ప్రస్తుతం అక్కడ దాదాపు 50,000 మందికి పైగా బెనె ఇజ్రాయెల్ వంశస్థులు నివసిస్తూ.. అక్కడ కూడా మరాఠీ వంటకాలను, సంస్కృతిని కాపాడుకుంటున్నారు. భారత్‌లో తమకు లభించిన గౌరవానికి కృతజ్ఞతగా, ఇజ్రాయెల్ గడ్డపై వీర శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఇరు దేశాల ప్రాచీన మైత్రికి ఒక సజీవ సాక్ష్యంగా నిలవనుంది.

# స్టాక్ మార్కెట్లకు లాభాలు

ముంబై: గత రెండు సెషన్లుగా కొనసాగుతున్న వరుస నష్టాలకు మంగళవారం బ్రేక్ పడింది. దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు వెల్లువెత్తడంతో సూచీలు గణనీయంగా పుంజుకున్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 394.50 పాయింట్ల లాభంతో 73,918.76 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 119.10 పాయింట్ల వృద్ధితో 23,242.10 వద్ద స్థిరపడ్డాయి. నేటి ట్రేడింగ్‌లో ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) బ్యాంకింగ్ షేర్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 3 శాతానికి పైగా లాభపడింది. ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, రియల్టీ రంగాల షేర్లలోనూ కొనుగోళ్ల మద్దతు లభించింది. అయితే, ఐటీ, మీడియా రంగాల సూచీలు నష్టాలతో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లోనూ కొనుగోళ్ల జోరు కనిపించగా. నిఫ్టీ మిడ్‌క్యాప్ 1.35 శాతం, స్మాల్‌క్యాప్ 1.69 శాతం చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పరిణామాలు దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య శాంతి చర్చలు పురోగమిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు భౌగోళిక ఉద్రిక్తతలను సడలించాయి. దీంతో ఇన్వెస్టర్లలో ధైర్యం పెరిగి, ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో కొనుగోళ్లకు మొగ్గు చూపారు. నిఫ్టీ లాభాల్లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐషర్ మోటార్స్, ఎస్‌బీఐ వంటి షేర్లు కీలక పాత్ర పోషించాయి. విశ్లేషకుల అంచనా ప్రకారం, నిఫ్టీ 23,300 స్థాయిని దాటితే 23,450-23,550 స్థాయిల వరకు వెళ్లే అవకాశం ఉంది. దిగువన 23,100 వద్ద తక్షణ మద్దతు లభించవచ్చని, ఒకవేళ ఈ స్థాయి కంటే దిగువకు పడిపోతే అమ్మకాల ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

# హర్మూజ్ వద్ద కుప్పకూలిన అపాచీ

**సురక్షితంగా బయటపడిన ఇద్దరు సిబ్బంది**

టెహ్రాన్: అమెరికా సైన్యానికి చెందిన అపాచీ హెలికాప్టర్ సోమవారం హర్మూజ్ జలసంధి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారని, వారికి ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ధృవీకరించారు. న్యూయార్క్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ట్రంప్, "పైలట్లు క్షేమంగా ఉన్నారు, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు" అని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక నివేదికను మంగళవారం విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ప్రపంచం చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన ప్రాంతం. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఈ ప్రమాదం సంభవించడం గమనార్హం.

# టీచర్లకు యోగా, ధ్యానం క్లాసులు





హయత్ నగర్, జూన్ 9 (ఈవార్తలు): జూన్ మాసం వచ్చిందంటే చాలు పలకా బలపం, పుస్తకాలు పెన్నులు పట్టుకొని విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు పిల్లలు బడికి వెళ్లేందుకు సిద్ధమవుతుంటారు. సుమారు రెండు నెలల పాటు వేసవి సెలవులను ఎంజాయ్ చేసిన కొందరు పిల్లలకు స్కూల్ అంటే ఖేదం.. ఇంకొందరికి మోదం. అందుకే, జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే స్కూలుకెళ్లాల్సిందేనని తల్లిదండ్రులు దగ్గరుండి మరీ బడులకు సాగదోలివెళుంటారు. అయితే ఆ పిల్లలను మానసికంగా దృఢంగా తయారుచేసేందుకు, వారికి నాణ్యమైన పాఠాలు బోధించేందుకు కొన్ని పాఠశాలలు ఇప్పటికే టీచర్లను నియమించుకొని వారిని సిద్ధం చేస్తున్నాయి. ఈ నెల 15 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కొన్ని పాఠశాలలు ఉపాధ్యాయులకు యోగా, ధ్యానం తరగతులు కూడా బోధిస్తున్నాయి. ఆ కోవకు చెందిన పాఠశాలే శ్లోక ది స్కూల్. హైదరాబాద్, హయత్‌నగర్‌లో ఉన్న ఈ శ్లోక పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులకు ప్రతిరోజు యోగా, ధ్యానం క్లాసులను బోధిస్తున్నది. విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు గాను ఉపాధ్యాయులు మానసికంగా ఎలా దృఢంగా ఉండాలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా మెడిటేషన్ ఉపాధ్యాయురాలు కట్టా శ్రీదేవి మాట్లాడుతూ... ఈ దేశానికి పునాది భావి భారత పౌరులే. అలాంటి పౌరులను తీర్చిదిద్దేది ముందుగా తల్లిదండ్రులైతే.. ఆ తర్వాతి స్థానం ఉపాధ్యాయులదే. అలాంటి ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఎంత బాధ్యతగా ఉండాలో, అలా ఉండాల్సిన ఉపాధ్యాయులు మానసికంగా ఎంత ఆత్మవిశ్వాసంతో ఉండాలో తెలియజేసేవే యోగా, ధ్యానం శిక్షణా తరగతులని ఆమె తెలిపారు. ప్రతీ విద్యార్థి, ఉపాధ్యాయురాలకు ధ్యానం ఎంతో అవసరమని, చదువుపై ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని ఈ తరగతులు పెంచుతాయని ఆమె అన్నారు. యోగా, ధ్యానం శిక్షణా తరగతుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న చైర్మన్ బిట్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ బిట్ల శైలజారెడ్డిలను ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. విద్యార్థుల పట్ల శ్లోక ది స్కూల్ చూపిస్తున్న శ్రద్ధను తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.



## అప్పుల భారంతో కౌలు రైతు బలవన్మరణం

బుగ్గారం, జూన్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన కౌలు రైతు మానాల పెద్ద దుబ్బయ్య (60) ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రామంలో విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. పెద్ద దుబ్బయ్య పలువురు రైతుల భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవారు. అయితే పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, దిగుబడి తగ్గిపోవడం వల్ల అప్పుల భారం పెరిగింది. ఈ ఏడాది వరి పంట కూడా ఆశించిన స్థాయిలో రాకపోవడంతో పెట్టుబడి ఖర్చులు, కౌలు బకాయిలు ఎలా చెల్లించాలనే ఆందోళనలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. మంగళవారం ఉదయం బుగ్గారం శివారులో ఆయన మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జి. సతీష్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



## మోరపల్లిలో 11 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు ప్రారంభం

జగిత్యాల రూరల్, జూన్ 9 (ఈవార్తలు): జగిత్యాల మండలం మోరపల్లిలో ఇండ్లపై నుంచి వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులను రూ.9 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. గ్రామ ప్రజల ఆరు దశాబ్దాల సమస్యకు ఇది పరిష్కారమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇండ్లపై విద్యుత్ లైన్ ప్రమాదకరమని, గతంలో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడం బాధాకరమన్నారు. లైన్ షిఫ్టింగ్ పనులకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. రైతు భరోసా నిధులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. మొరపల్లి గ్రామానికి 60 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామంలో శ్మశానవాటిక విద్యుతీకరణ, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## డీటీఓతో ట్రావెల్స్ ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ

జగిత్యాల టౌన్, జూన్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకు నూతనంగా నియమితులైన జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సందాని, వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను పాత బస్టాండ్ ప్రైవేట్ ట్రావెల్స్ యూనియన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ పరిధిలోని రవాణా వ్యవస్థ, ప్రైవేట్ ట్రావెల్స్‌కు సంబంధించిన పలు అంశాలపై ప్రతినిధులు అధికారులతో చర్చించారు. ట్రావెల్స్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సేవల మెరుగుదలపై తమ అభిప్రాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాత బస్టాండ్ ప్రైవేట్ ట్రావెల్స్ యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ భాయ్, రఘుపతి రెడ్డి, చారి, నవీన్, కిషన్ పాల్గొన్నారు. అలాగే ప్రైవేట్ ఆర్టీసీ బస్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి చుక్క వేణుగోపాల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమకు సహకరించాలని ప్రతినిధులు కోరగా, నిబంధనల మేరకు పూర్తి సహకారం అందిస్తామని జిల్లా రవాణా శాఖ అధికారులు హామీ ఇచ్చారు.

## వర్షాకాల వ్యాధులతో జాగ్రత్త

**ప్రజలకు అవగాహన కల్పించాలి**

**అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు**

జగిత్యాల, జూన్ 9 (ఈవార్తలు): వర్షాకాలం నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు ముందస్తుగా ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేలు, ఆయిల్ బాల్స్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భారీ వర్షాల అవకాశాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. పునరావాస కేంద్రాల కోసం ఫంక్షన్ హాళ్లు, పాఠశాల భవనాలను గుర్తించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నదులు, కాలువలు, చెరువుల సమీప ప్రాంతాల్లో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు

# సర్కారు ఆస్పత్రి.. రోగులకు దాపోర్తి!

**జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో నీటి కష్టాలు.. 15 రోజులుగా తాగునీరు, బాత్రూంలలో నీళ్లు బంద్.. నరకయాతన అనుభవిస్తున్న రోగులు**

జగిత్యాల బ్యూరో, జూన్ 9 (ఈవార్తలు): జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత 15 రోజులుగా కనీసం తాగడానికి ఒక్క గ్లాస్ నీరు లేక, బాత్రూంలలో చుక్క నీరు రాక రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలాది మంది పేద ప్రజలు ఆధారపడే ఈ ఆసుపత్రికి జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నియోజకవర్గమైన ధర్మపురి ప్రాంతం నుంచి కూడా రోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్వయంగా వైద్య వృత్తికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి ఇంత దారుణంగా మారడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు వారాలుగా సమస్య కొనసాగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బాధపడేది సామాన్య ప్రజలే కాబట్టే ఈ నిర్లక్ష్యమా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక మరోవైపు రోగులకు తాగునీరు అందుబాటులో లేకపోయినా, ఆసుపత్రి సిబ్బంది గదుల్లోని కూలర్లకు మాత్రం నీటి కొరత లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల కంటే ఉద్యోగుల సౌకర్యాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అనేక మీడియా సంస్థల్లో వరుసగా కథనాలు ప్రసారమైనప్పటికీ, వార్డుల్లోకి వెళ్లి పరిస్థితిని పరిశీలించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడవద్దని, తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఇది కేవలం నీటి సమస్యగా కాకుండా, ప్రజాప్రతినిధులు, అధికారుల వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తుందని హెచ్చరిస్తున్నారు.





## డీవీజీ ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కూకట్‌పల్లి, జూన్ 9 (ఈవార్తలు): కూకట్‌పల్లి-ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో నివసించే నరేంద్ర కుమార్ (23) అనారోగ్యంతో మరణించారు. అయితే, అంత్యక్రియల నిమిత్తం డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ ఆర్థిక సాయం అందించి గొప్ప మనసు చాటుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, డీవీజీ ట్రస్ట్ ద్వారా రూ.5000 అందజేశారు. నరేంద్ర కుమార్ కుటుంబాన్ని పరామర్శించినవారిలో భిక్షపతి, వాలి నాగేశ్వరరావు, మధులత, సునీత, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జూన్ 9 (ఈవార్తలు): మంగళవారం పురస్కరించుకుని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామున కోనేరు లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే క్షేత్రపాలకుడైన శ్రీ బేతలస్వామి వారిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి సుమారు 20 వేల మంది భక్తులు విచ్చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి భక్తులకు ఇలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## మటాంజనేయస్వామికి శఠగోపం అందజేత

మల్యాల, జూన్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలకేంద్రంలోని శ్రీ మటమంజనేయ స్వామివారికి చిప్ప గంగారాం-భాగ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు రూ.75,000 విలువైన వెండి శఠగోపాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ప్రత్యేక పూజలు చేసి, ఆశీర్వచనం అందించారు.

## ఎరువుల కొరత రాకుండా చూడాలి

**కలెక్టర్‌కు ఎమ్మెల్యే సంజయ్ వినతి**

జగిత్యాల, జూన్ 9 (ఈవార్తలు): వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎరువుల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు నిల్వలు ఏర్పాటు చేయడంతో పాటు జిల్లాలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో తగినంత నిల్వలు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులకు అవసరమైన సమయంలో నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంటేనే పంటల సాగు సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# 89 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



మల్లాపూర్, జూన్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మల్లాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో మండలానికి చెందిన 89 మంది లబ్ధిదారులకు రూ.89,10,324 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఈ పథకాల ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని, ఆడబిడ్డల పెళ్లిళ్ల విషయంలో కేసీఆర్ ఎల్లప్పుడూ అండగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం కోసం కేసీఆర్ అనేక వినూత్న సంక్షేమ పథకాలను అమలు చేశారని, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అమలు చేసిన పథకాలు తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో కేసీఆర్ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని, భవిష్యత్తులో కూడా బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు.

## కేసుల రాజీకి లోక్ అదాలత్ సరైన వేదిక

**ప్రజలకు ఎస్పీ అశోక్ కుమార్ సూచన**

జగిత్యాల, జూన్ 9 (ఈవార్తలు): ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన, కుటుంబ నిర్వహణ, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, చిన్నచిన్న పెట్టి కేసులు తదితర అంశాలను లోక్ అదాలత్‌లో సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. రాజీ మార్గమే రాజమార్గం అనే భావనతో న్యాయ వ్యవస్థ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తమ కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

## కోటిలింగాల అభివృద్ధికి ఎంపీ చొరవ చూపాలి

**ఎంపీ గడ్డం వంశీకృష్ణను కోరిన పత్తిపాక వెంకటేష్**



ఎండపల్లి, జూన్ 9 (ఈవార్తలు): కోటిలింగాల ఆలయ అభివృద్ధికి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక చొరవ చూపాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ కోరారు. ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా కోటిలింగాల దేవస్థాన రథోత్సవానికి అవసరమైన శాశ్వత రథం నిర్మాణం కోసం సుమారు రూ.20 లక్షలు మంజూరు చేయాలని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల దేవస్థానం అత్యంత పురాతనమైన, చారిత్రక ప్రాధాన్యత కలిగిన మహా శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిందని వెంకటేష్ పేర్కొన్నారు. శాతవాహనుల కాలంలో రాజధానిగా వెలుగొందిన కోటిలింగాల నేడు తెలంగాణలో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే రథోత్సవ వేడుకలకు శాశ్వత రథం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం, దేవాలయ అభివృద్ధి దృష్ట్యా శాశ్వత రథం నిర్మాణానికి అవసరమైన నిధులను ఎంపీ లాడ్స్ ద్వారా వెంటనే మంజూరు చేయాలని కోరారు. ధర్మపురి నియోజకవర్గం కూడా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోనే ఉన్నందున స్థానిక రాజకీయ విభేదాలకు అతీతంగా ప్రజల ఆకాంక్షలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్నారు. ప్రజల మద్దతుతో గెలుపొందిన ఎంపీ వంశీకృష్ణ కోటిలింగాల వంటి చారిత్రక, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కోటిలింగాల దేవస్థానానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు శాశ్వత రథం నిర్మాణానికి నిధులు కేటాయిస్తే వేలాది మంది భక్తులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పురాతన వైభవానికి ప్రతీకగా నిలిచిన కోటిలింగాల దేవస్థానం అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని పత్తిపాక వెంకటేష్ పేర్కొన్నారు.

## మందుబాబుల అడ్డాగా మహిళా సంఘ భవనం

**మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురండి**

**ప్రభుత్వానికి మహిళల వినతి**

ఎండపల్లి, జూన్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామంలో నిర్మించిన మహిళ సంఘ భవనం సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఉమ్మడి వెల్లటూర్ మండలంలోనే మొదటి మహిళ సంఘ భవనం చర్లపల్లి గ్రామంలో నిర్మించారు. ఇక్కడ సుమారు 36 గ్రామైక్య సంఘాలు 400 మంది సభ్యులు ఉండగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రూ.10 లక్షల నిధులతో నిర్మాణం కాగా అప్పటి చీఫ్ విప్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. తర్వాత మహిళలు సంఘాల పురోగతి, అర్థిక అభివృద్ధికి స్వయం ఉపాధి వంటి అనేక కార్యక్రమాలతో సమావేశాలు నిర్వహించుకుని వారి సాధికారతకు బాటలు వేసుకున్నారు. అయితే, కరెంటు సరఫరా, విద్యుత్తు దీపాలు, నీటి సరఫరా, పర్యవేక్షణ లేకపోవడంతో మహిళలు అటువైపు వెళ్లడం మానేశారు.

## పెట్రో ధరల మోత.. ప్రజలకు వాత


**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై దావ వసంత ఫైర్**

జగిత్యాల, జూన్ 9 (ఈవార్తలు): పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నిరంతరం పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని బీఆర్ఎస్ నాయకురాలు దావ వసంత సురేష్ విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదలతో సామాన్య ప్రజల జీవనం రోజురోజుకూ భారంగా మారుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. కూరగాయల నుంచి రవాణా ఖర్చుల వరకు ప్రతి రంగంలో ధరలు పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ధరలు తగ్గిస్తామని, ప్రజల కష్టాలు తీర్చుతామని హామీలు ఇచ్చిన కూటమి నాయకులు ప్రస్తుతం పెరుగుతున్న ధరలపై మౌనం వహించడం బాధాకరమన్నారు. ఇంధన ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దేశం, ధర్మం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలపై అదనపు భారాలు మోపుతున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని దావ వసంత సురేష్ డిమాండ్ చేశారు.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# సేంద్రియ సేద్యమే భవిష్యత్తుకు భరోసా

**భారతదేశం** వ్యవసాయాధారిత దేశం. కోట్లాది మంది ప్రజల జీవనాధారం వ్యవసాయమే. అయితే గత కొన్ని దశాబ్దాలుగా అధిక దిగుబడుల లక్ష్యంతో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం విపరీతంగా పెరిగింది. మొదట్లో ఉత్పత్తి పెరిగినప్పటికీ, దీర్ఘకాలంలో ఈ విధానం భూమి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందనే వాస్తవం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే పర్యావరణ అసమతుల్యత, వాతావరణ మార్పులు, నీటి కాలుష్యం వంటి సమస్యలతో ప్రపంచం సతమతమవుతున్న తరుణంలో సేంద్రియ వ్యవసాయం అవసరం గతంలో కంటే నేడు మరింత పెరిగింది. భూమి కేవలం పంటలు పండించే సాధనం కాదు. అది జీవవ్యవస్థకు మూలాధారం. నేలలో ఉండే సూక్ష్మజీవులు, పోషకాలు, జీవసంపద వ్యవసాయానికి ప్రాణం. కానీ రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేలలోని సహజ జీవక్రియలు దెబ్బతింటున్నాయి. భూమి సారవంతత క్రమంగా తగ్గిపోతోంది. ప్రతి ఏడాది ఎక్కువ ఎరువులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒకప్పుడు తక్కువ పెట్టుబడితో పండిన పంటలు ఇప్పుడు అధిక ఖర్చుతో సాగుచేయాల్సి వస్తోంది. ఇది రైతుల ఆర్థిక భారం పెంచడమే కాకుండా వ్యవసాయాన్ని లాభసాటిగా లేకుండా చేస్తోంది. రసాయన ఎరువుల ప్రభావం కేవలం నేలపైనే కాదు. భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయి. ఎరువుల అవశేషాలు నీటిలో కలవడంతో తాగునీటి నాణ్యత దెబ్బతింటోంది. మరోవైపు పంటల్లో మిగిలిపోయే రసాయన అవశేషాలు మన ఆహార గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత, గుండె సంబంధిత వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఇవి ఒక కారణమవుతున్నాయని అనేక అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాలు, కరువులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వ్యవసాయాన్ని అస్థిరంగా మారుస్తున్నాయి. ఇలాంటి సమయంలో నేలలో జీవసారం పెంచే సేంద్రియ వ్యవసాయం వాతావరణ మార్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతుంది. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన భూములు ఎక్కువ నీటిని నిల్వ ఉంచగలవు. నేల నిర్మాణం మెరుగుపడుతుంది. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని కొంత మేర తట్టుకునే శక్తి లభిస్తుంది. సేంద్రియ వ్యవసాయం అంటే కేవలం రసాయనాలను మానేయడం మాత్రమే కాదు. అది ప్రకృతితో సహజీవనం చేసే వ్యవసాయ విధానం. పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్, జీవామృతం, పంటల మార్పిడి, హరిత ఎరువులు వంటి పద్ధతుల ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడే ప్రక్రియ. ఈ విధానం రైతులకు స్వావలంబనను కూడా అందిస్తుంది. మార్కెట్లో కొనుగోలు చేసే రసాయనాలపై ఆధారపడకుండా స్థానిక వనరులతోనే వ్యవసాయం సాగించే అవకాశం ఉ ంటుంది. ప్రపంచవ్యాప్తంగా సేంద్రియ ఆహార ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరగడంతో సహజ పద్ధతుల్లో పండించిన ఆహారానికి మంచి మార్కెట్ ఏర్పడుతోంది. ఈ అవకాశాన్ని భారత రైతులు వినియోగించుకుంటే దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో కూడా మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంది. అయితే సేంద్రియ వ్యవసాయాన్ని పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలంటే ప్రభుత్వాల పాత్ర కీలకం. రైతులకు శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ సదుపాయాలు, ధ్రువీకరణ ప్రక్రియలో సులభతరం వంటి చర్యలు అవసరం. వినియోగదారులు కూడా సేంద్రియ ఉత్పత్తుల ప్రాముఖ్యతను గుర్తించి వాటిని ప్రోత్సహించాలి. నేడు మనం తీసుకునే నిర్ణయాలు రేపటి తరాల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అధిక దిగుబడుల మోహంలో భూమిని నిర్జీవంగా మార్చుకుంటే రాబోయే తరాలకు సారవంతమైన నేల, స్వచ్ఛమైన నీరు, ఆరోగ్యకరమైన ఆహారం అందించే అవకాశం కోల్పోతాం. అందుకే సేంద్రియ వ్యవసాయం ఒక ప్రత్యామ్నాయం కాదు; అది పర్యావరణ పరిరక్షణకు, ప్రజారోగ్యానికి, వ్యవసాయ భవిష్యత్తుకు తప్పనిసరి మార్గం. భూమిని కాపాడుకోవాలంటే, ప్రకృతిని రక్షించుకోవాలంటే, మన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలంటే సేంద్రియ సేద్యాన్ని జీవన విధానంగా స్వీకరించే సమయం ఆసన్నమైంది.



# మోయలేని భారం.. విద్య!

పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయం రాగానే విద్యార్థుల్లో ఆనందం కనిపిస్తుంది. కానీ అదే సమయంలో తల్లిదండ్రుల ముఖాల్లో ఆందోళన కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ కాలం ఆర్థిక పరీక్షగా మారుతోంది. ఫీజులు, పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు, షూస్, బ్యాగులు వంటి అవసరాల పేరుతో వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలలు నిర్దిష్ట దుకాణాల్లోనే వస్తువులు కొనుగోలు చేయాలని సూచించడం మరింత భారంగా మారుతోంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంత కష్టమైనా భరిస్తున్నప్పటికీ, పెరుగుతున్న ఖర్చులు వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు. అది కుటుంబాలకు భారంగా మారకూడదు. విద్యాసంస్థలు లాభాపేక్ష కంటే సామాజిక బాధ్యతను గుర్తుంచుకోవాలి. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అనవసర ఖర్చులను తగ్గించే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కూడా ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, అదనపు వసూళ్లు, పుస్తకాలు మరియు యూనిఫారాల విక్రయ విధానాలపై సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉ ంది. విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలి. విద్య వెలుగు నింపాలి గానీ, కుటుంబాలపై ఆర్థిక చీకట్లు కమ్మే పరిస్థితి రాకూడదు. అదే నిజమైన విద్యా వ్యవస్థ లక్ష్యం కావాలి.



**వెంకటేశ్ గుగ్గిళ్ల**
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

# 4,399 రోజులు ప్లస్..

## (భారతావనిపై మోదీ మార్కు)

భారత రాజకీయ చరిత్రలో 2026 జూన్ 10 ఒక ప్రత్యేక మైలురాయిగా నిలవనుంది. దేశాన్ని అత్యధిక కాలం నిరంతరాయంగా పాలించిన ప్రధానమంత్రిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ప్రధాని నరేంద్ర మోదీ అధిగమించారు. ఇది కేవలం ఒక సంఖ్యా రికార్డు మాత్రమే కాదు. స్వాతంత్ర్యానంతర భారతదేశం నుంచి డిజిటల్ యుగంలోని భారతదేశం వరకు దేశ పరిపాలన ఎలా రూపాంతరం చెందిందో ప్రతిబింబించే సందర్భం కూడా. నెహ్రూ, మోదీ ఇద్దరూ తమ తమ కాలాల్లో భిన్నమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు.



స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజకీయ, ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను నిర్మించాల్సిన బాధ్యత నెహ్రూపై ఉండగా, ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం, అంతర్జాతీయ పోటీ మధ్య 140 కోట్ల జనాభా కలిగిన దేశాన్ని ముందుకు నడిపించే బాధ్యత మోదీపై పడింది. అందుకే ఇద్దరి పాలనలను కేవలం కాలవ్యవధితో కాకుండా, వారు ఎదుర్కొన్న సవాళ్ల స్వభావంతో కూడా అంచనా వేయాల్సి ఉంటుంది. మోదీ హయాంలో ప్రపంచాన్ని కుదిపేసిన కోవిడ్-19 మహమ్మారి అతిపెద్ద సవాలుగా నిలిచింది. ఆరోగ్య సంక్షోభంతో పాటు ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం పడిన సమయంలో కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో టీకా కార్యక్రమం నిర్వహించడం, కోట్లాది మందికి ఉచిత రేషన్ అందించడం వంటి చర్యల ద్వారా పరిస్థితులను ఎదుర్కొంది. అంతేకాదు, ప్రతి నిర్ణయం సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ద్వారా క్షణక్షణం ప్రజల పరిశీలనకు గురవుతున్న యుగంలో పరిపాలన మరింత క్లిష్టంగా మారింది. విదేశాంగ విధానంలో కూడా భారతదేశం గణనీయమైన మార్పును చూసింది. నెహ్రూ కాలంలో అలీనోద్యమం ద్వారా స్వతంత్ర విదేశాంగానికి పునాది పడితే, మోదీ కాలంలో భారత్ బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ వేదికపై తన ప్రభావాన్ని పెంచుకుంది. అమెరికా, రష్యా, యూరప్, గల్ఫ్ దేశాలు, గ్లోబల్ సౌత్ దేశాలతో సమతుల్య సంబంధాలను కొనసాగిస్తూ జాతీయ ప్రయోజనాలను కాపాడే దిశగా అడుగులు వేసింది.

పరిపాలనలో సాంకేతికత వినియోగం మోదీ హయాంలో ప్రధాన మార్పుగా నిలిచింది. జన్ ధన్-ఆధార్-మొబైల్ వ్యవస్థ, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చేరేలా చేశారు. దీంతో మధ్యవర్తుల పాత్ర తగ్గడమే కాకుండా పారదర్శకత పెరిగిందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ కూడా ఈ కాలంలో విశేషంగా కనిపించింది. యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు, స్టార్టప్‌ల పెరుగుదల, ఐటీ రంగం విస్తరణతో భారత్ ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానాన్ని సంపాదించింది. ఒకప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశంగా గుర్తింపు పొందిన భారత్, నేడు సాంకేతిక సామర్థ్యం కలిగిన ప్రధాన ఆర్థిక శక్తిగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

అయితే, నెహ్రూ వేసిన సంస్థాగత పునాదులు, మోదీ చేపట్టిన సాంకేతిక-పరిపాలనా సంస్కరణలు రెండూ భారత అభివృద్ధి ప్రయాణంలో కీలక ఘట్టాలే. ఒకరు దేశ నిర్మాణానికి బాటలు వేస్తే, మరొకరు ఆ పునాదులపై డిజిటల్, ఆర్థిక, మౌలిక సదుపాయాల ఆధారిత కొత్త భారతాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. నెహ్రూ రికార్డును అధిగమించడం ద్వారా మోదీ పేరు భారత రాజకీయ చరిత్రలో మరో ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. ఈ మైలురాయి గతాన్ని గుర్తుచేస్తూనే, భవిష్యత్ భారత దిశపై కొత్త చర్చలకు కూడా మార్గం సుగమం చేస్తోంది. దేశ నిర్మాణం నుంచి డిజిటల్ పరివర్తన వరకు సాగిన ఈ ప్రయాణం, భారత ప్రజాస్వామ్య పరిణామ క్రమానికి ప్రతీకగా నిలుస్తోంది.



**గంగాధర్ బొమ్మకంటి**
ఈవార్తలు దినపత్రిక చైర్మన్

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.

## వయ్యారి చిత్రం





## నాని 'ది పారడైజ్' మళ్లీ వాయిదా?

నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ది పారడైజ్' మరోసారి వాయిదా పడే దిశగా కనిపిస్తోంది. మొదట మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రం, ఆ తర్వాత ఆగస్టు 21కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఆగస్టు 21వ తేదీని మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న 'ఇరుముడి' సినిమా లాక్ చేసుకోవడంతో నాని సినిమా పోస్ట్‌పోన్ కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సినిమాకు సంబంధించిన కొంత వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం.. 'ది పారడైజ్' చిత్రం సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ప్రచారం మాత్రమేనని, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని ఇండస్ట్రీ టాక్. బ్లాక్‌బస్టర్ 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది పారడైజ్' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయాడు లోహర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.

## చరణ్ ది బెస్ట్ ఇచ్చాడు: బన్నీ




పెద్ది సినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రత్యేకంగా వీక్షించారు. సినిమా చూసిన వెంటనే బన్నీ పాజిటివ్ రెస్పాన్స్ ఇచ్చాడు. చిత్ర యూనిట్ తో పాటు హీరో రామ్ చరణ్ నటనపై రివ్యూ ఇచ్చారు. నిన్న రాత్రి పెద్ది సినిమా చూశానని చెబుతూ రామ్ చరణ్ మైండ్ బ్లోయింగ్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడని అల్లు అర్జున్ రాసుకొచ్చారు. చరణ్ యాక్టింగ్ చాలా రస్టిక్ గా ఉందని, సినిమాలో అతని బాడీ ట్రాన్స్ఫర్మేషన్, గ్రేస్ ఫుల్ డాన్స్ మూమెంట్స్ అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. ప్రతి విషయంలో చరణ్ ది బెస్ట్ ఇచ్చాడని చెబుతూ.. తన బ్రదర్ ని చూస్తుంటే చాలా గర్వంగా ఉందని, ప్రేక్షకుల ప్రశంసలకు అతను పూర్తిగా అర్హుడని ట్వీట్ లో పేర్కొన్నారు. చరణ్ తో పాటే సినిమాలో ఇతర కీలక పాత్రలు పోషించిన నటీనటుల గురించి కూడా అల్లు అర్జున్ ప్రస్తావించారు.

## ఆగస్టు 7న కొరియన్ కనకరాజు వస్తున్నాడు!



మెగా హీరో వరుణ్ తేజ్ మేర్లపాక గాంధీ దర్శకత్వంలో కొరియన్ కనకరాజు సినిమా చేశాడు. యువి క్రియేషన్స్ లాంటి పెద్ద బేనర్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేసింది. ఐతే ఈ సినిమా ఎప్పుడో మొదలైంది. ఎప్పుడో పూర్తయినట్లు కూడా వార్తలు వచ్చాయి. కానీ ఎంతకీ విడుదలకు మాత్రం నోచుకోవట్లేదు. కొన్ని నెలలుగా సినిమా నుంచి అసలే అప్‌డేట్ లేదు. వేసవిలోనే ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకున్నారు కానీ.. ఏవో కారణాలతో సాధ్యపడలేదు. కనీసం రిలీజ్ డేట్ కూడా అనౌన్స్ చేయకుండా, ఏ అప్‌డేట్ ఇవ్వకుండా ఉండిపోవడం వల్ల సినిమా మీద ప్రేక్షకుల్లో ఆసక్తి సన్నగిల్లిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే మేకర్స్ కొరియన్ కనకరాజు రిలీజ్ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆగస్టు 7న వరుణ్ కొత్త చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారట. యువి బేనర్లోనే తెరకెక్కిన పెద్ద సినిమా విశ్వంభర విషయం ఎటూ తేలకుండా ఉండడంతో కొరియన్ కనకరాజు మీద కూడా నిర్మాతలు ఫోకస్ పెట్టలేకపోయారు. మరి ఇప్పుడు విశ్వంభర సంగతి తేలిందో లేదో కానీ.. కొరియన్ కనకరాజును అయితే ఆగస్టు తొలి వారంలో థియేటర్లలోకి తీసుకొచ్చేయబోతున్నారు.

## జయం రవికి హైకోర్టులో చుక్కెదురు

నటుడు జయం రవి (రవి మోహన్), ఆయన భార్య ఆర్తి రవిల మధ్య జరుగుతున్న విడాకుల వ్యవహారంలో మద్రాస్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్తి రవి దాఖలు చేసిన తాత్కాలిక భరణం కేసులో కుటుంబ సంక్షేమ కోర్టుకు మరికొంత సమయం ఇవ్వాలంటూ జయం రవి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. జస్టిస్ అబ్దుల్ ఖుద్దోస్ ఈ పిటిషన్‌ను విచారించి, గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారమే రెండు వారాల వ్యవధిలోనే ఫ్యామిలీ కోర్టు ఈ భరణం పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. 2025 ఏప్రిల్ నుంచి జయం రవి తనకు భరణంతో పాటు పిల్లల స్కూల్ ఫీజులను కూడా చెల్లించలేదని, ఈ వ్యవహారంపై త్వరగా విచారణ జరిపించాలని కోరుతూ ఆర్తి గతంలో హైకోర్టును ఆశ్రయించారు. అయితే దీనిపై స్పందించిన హైకోర్టు, రెండు వారాల్లోగా ఈ కేసును తేల్చాలని చెన్నైలోని ఫ్యామిలీ కోర్టును ఆదేశించింది. అయితే, ఈ గడువును పొడిగించాలంటూ జయం రవి మళ్లీ హైకోర్టును ఆశ్రయించగా, ఆర్తి తరపు సీనియర్ న్యాయవాది జె. రవీంద్రన్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి రవి విజ్ఞప్తిని తిరస్కరిస్తూ, తదుపరి విచారణ కోసం ఫ్యామిలీ కోర్టునే ఆశ్రయించాలని సూచించారు.



## రణ్‌వీర్‌కు మద్దతుగా పూనమ్ థిల్లాన్

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ -డాన్ 3- నుండి అర్ధాంతరంగా తప్పుకున్నారనే కారణంతో నిర్మాత ఫిర్యాదు మేరకు ఫెడరేషన్ అతడిపై నిషేధం (బ్యాన్) విధించిన సంగతి తెలిసిందే. దీనిపై పరిశ్రమలో తీవ్ర చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో.. సీనియర్ నటి .. సినీ అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పూనమ్ థిల్లాన్ రణవీర్ సింగ్‌కు పూర్తి మద్దతుగా నిలిచారు. ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ రణవీర్‌పై నాన్-కోఆపరేషన్ అంటూ జారీ చేసిన ఆదేశాలను తీవ్రంగా తప్పుబట్టారు. ఒక మూడవ పక్షం జోక్యం చేసుకుని ఇలా ఏకపక్షంగా యుద్ధం ప్రకటించినట్లు నిషేధం విధించడం విడ్డూరంగా ఉందన్న పూనమ్ ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి రణవీర్ తమ అసోసియేషన్‌ను ఆశ్రయించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఫర్హాన్ బ్యానర్ లో గతంలో గల్లీబోయ్ సహా మరో పెద్ద హిట్ చిత్రంలోను నటించిన అనుబంధం రణ్ వీర్ కి ఉందని గుర్తు చేసారు.. అతడు ఎవరికీ కావాలని నష్టం చేసే వ్యక్తి కాదని... ఏదైనా బలమైన కారణం వల్లే -డాన్ 3- నుండి తప్పుకుని ఉంటారని పేర్కొన్నారు. సినిమా నుండి తప్పుకున్నందుకు రణవీర్ అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇవ్వడమే కాకుండా... దాదాపు 10 కోట్ల రూపాయల నష్టపరిహారాన్ని కూడా ఆఫర్ చేశారని... చాలామంది నటులు అసలు ఆ పని కూడా చేయరని రణవీర్‌ను అభినందించారు.



## రాహుల్ రామకృష్ణపై సైబర్ దాడులు

ప్రస్తుతం ఉన్న రోజుల్లో సోషల్ మీడియా వేదికగా ఎవరైనా ఒక ప్రముఖ నాయకుడిని ప్రశ్నించినా లేదా తమ రాజకీయ అభిప్రాయాన్ని బలంగా వినిపించినా తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి రావడం సర్వసాధారణంగా మారిపోయిన సంగతి తెలిసిందే. ఇటీవల టాలీవుడ్ నటుడు రాహుల్ రామకృష్ణ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4.1(బి) ప్రకారం పారదర్శకత, ముందస్తు సమాచార వెల్లడి గురించి ప్రశ్నిస్తూ చేసిన ట్వీట్లు తీవ్ర దుమారాన్ని రేపాయి. అయితే ఆ ట్వీట్ల చివరలో ఆయన "జై తెలంగాణ" అని రాయడం, దానికి తోడు పవన్ కళ్యాణ్ ఇటీవల తెలంగాణ రాజకీయాలపై చేసిన కొన్ని వ్యాఖ్యల నేపథ్యం కూడా తోడవడంతో ఈ వ్యవహారం పెద్ద వివాదానికి దారితీసింది. దీనిపై జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్‌తో విరుచుకుపడ్డారు. అయితే ఈ సైబర్ దాడి మితిమీరడంతో రాహుల్ రామకృష్ణ మొదట 'ప్రశ్నించినంత మాత్రాన నేను దేశద్రోహిని కాను', 'నా వల్లనే ప్రాబ్లెమ్ అంటే వెళ్ళిపోతా మావా' అంటూ బదులిచ్చినప్పటికీ.. చివరికి జనసైనికుల ఒత్తిడిని తట్టుకోలేక పవన్ కళ్యాణ్‌ని ప్రశ్నించిన ట్వీట్లను రాహుల్ డిలీట్ చేసినట్లు తెలుస్తుంది.



## తొలి చూపు ప్రేమ ఓ భ్రమ



బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ ముక్కుసూటి తత్వం గురించి తెలిసిందే. సమాజం.. సినిమా లేదా వ్యక్తిగత విషయాలు ఏదైనా సరే? అమ్మడు మనసులోని అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకుంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రేమ .. పెళ్లి వంటి జీవిత భాగస్వామ్య బంధాలపై తాజాగా అమ్మడు చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాలలో పెద్ద చర్చకు దారితీశాయి. సినిమాల్లో చూపించే -తొలిచూపు ప్రేమ- అనే భావనపై కంగనా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. నిజ జీవితంలో అలాంటివి జరగవని, అదంతా కేవలం ఒక భ్రమ ..అర్థరహితమైన విషయమని కొట్టిపారేశారు. ఒకరి బాహ్య రూపాన్ని చూసి ప్రేమిస్తున్నామనుకోవడం సరికాదని.. నిజమైన అనుబంధం అనేది కాలక్రమేణా ఒకరినొకరు అర్థం చేసుకోవడం ద్వారా మాత్రమే బలపడుతుందని అభిప్రాయపడ్డారు. పెళ్లి .. జీవిత భాగస్వామిని ఎంచుకోవడం గురించి మాట్లాడారు. దీనిపై నేటి తరం యువతకు ఆమె ఓ విలువైన సలహా ఇచ్చారు. ఈ ప్రపంచంలో మనల్ని అర్థం చేసుకునే మనతో కలిసి నడిచే ఒక సరైన వ్యక్తి దొరకడం చాలా అరుదైన విషయమని పేర్కొన్నారు. ఒకవేళ అలాంటి వ్యక్తి మీ జీవితంలోకి వస్తే ఆ బంధాన్ని ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని.. దానికి తగిన విలువ ఇవ్వాలని సూచించారు. సమకాలీన సమాజంలో బంధాలు చాలా త్వరగా ముక్కలైపోతున్న తరుణంలో పరస్పర గౌరవం.. సర్దుబాటు ధోరణి ఎంత ముఖ్యమో ఈ సందర్భంగా కంగనా గుర్తు చేశారు.

## ఏలియన్ల కథతో స్టీవెన్ స్పీల్‌బర్గ్ సైన్స్ ఫిక్షన్!



హాలీవుడ్ లెజెండరీ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ సైన్స్ ఫిక్షన్ - గ్రహాంతరవాసుల కథలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట. -ఈటీ -, -క్లోజ్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్-, -వార్ ఆఫ్ ది వరల్డ్స్- వంటి చిత్రాలతో ప్రపంచ ప్రేక్షకులను మైమరపించిన స్పీల్ బర్గ్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ అదే తరహా సరికొత్త చిత్రంతో రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం -డిస్‌క్లోజర్ డే- జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాకు సంబంధించిన విశేషాలు ప్రపంచ సినిమా పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ చిత్రం కేవలం ఊహాజనిత గ్రహాంతరవాసుల దాడికి సంబంధించినది కాదని దీని వెనుక బలమైన హ్యూమన్ డ్రామా ..ప్రభుత్వ రహస్యాల కథాంశం ఉందని స్పీల్‌బర్గ్ రివీల్ చేసారు. భూమిపై ఏలియన్ల ఉనికికి సంబంధించిన నిజాలను ప్రపంచానికి తెలియజేయాలనుకునే ఒక యువ విజిల్‌బ్లోయర్ కథ చుట్టూ తిరుగుతుంది.



2026 ఫిఫా ప్రపంచకప్‌కు అంతా సిద్ధమైంది. ఈ టోర్నీ గురువారం అధికారికంగా ప్రారంభమవుతుంది. ఈసారి అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా దీనికి ఆతిథ్యం ఇస్తున్నాయి. ఈ ప్రపంచకప్‌లో మొత్తం 48 జట్లు పాల్గొంటున్నాయి. ఫిఫా ప్రపంచకప్ క్రీడా ప్రపంచంలోనే అతిపెద్ద ఈవెంట్.




# ఫిఫా ప్రైజ్ మనీ.. 476 కోట్లు

| స్థానం | ప్రైజ్ మనీ | భారత కరెన్సీలో |
|---|---|---|
| విజేత | 50 మిలియన్ | 476 కోట్లు |
| రన్నరప్ | 33 మిలియన్ | 314 కోట్లు |
| 3వ స్థానం | 29 మిలియన్ | 276 కోట్లు |
| 4వ స్థానం | 27 మిలియన్ | 257 కోట్లు |
| 5-8 స్థానాలు | 19 మిలియన్ | 181 కోట్లు |
| 9-16 స్థానాలు | 15 మిలియన్ | 143 కోట్లు |
| 17-32 స్థానాలు | 11 మిలియన్ | 105 కోట్లు |
| 33-48 స్థానాలు | 9 మిలియన్ | 86 కోట్లు |

దీని నిర్వహణ బాధ్యతలను ఫిఫా సంస్థ చూస్తుంది. ఈసారి ప్రైజ్ మనీ రికార్డు స్థాయిలో ఉంది. టోర్నీ మొత్తం బహుమతి సొమ్మును ఫిఫా భారీగా పెంచింది. ఇది క్రీడా ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈవెంట్. 2022 ఖతార్ వరల్డ్ కప్‌లో మొత్తం ప్రైజ్ మనీ 440 మిలియన్ డాలర్లు. ఇప్పుడు అది 655 మిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.6,240 కోట్లు. విజేతగా నిలిచే జట్టు ఈసారి భారీ మొత్తాన్ని అందుకుంటుంది. విజేత జట్టు 50 మిలియన్ డాలర్లు తీసుకుంటుంది. భారత రూపాయల్లో దీని విలువ సుమారు రూ.476 కోట్లు. గతేడాది విజేతకు 42 మిలియన్ డాలర్లు మాత్రమే దక్కాయి. ఈ పెంపు ఆటకు మరింత ఆకర్షణను తెచ్చింది. ఫిఫా తన ఆర్థిక పంపిణీని ఇప్పటికే ప్రకటించింది.

అర్హత సాధించిన ప్రతి జట్టుకు ప్రత్యేక మొత్తం అందుతుంది. క్వాలిఫికేషన్ కోసం 10 మిలియన్ డాలర్లు ఇస్తారు. జట్టు తయారీ కోసం మరో 2.5 మిలియన్ డాలర్లు ఇస్తారు. చివరగా నిలిచిన జట్టుకు కూడా మంచి మొత్తం దక్కుతుంది. ఆ జట్టు 21.5 మిలియన్ డాలర్లు తీసుకుంటుంది. ఇది ఫిఫా మొత్తం ఆర్థిక పంపిణీలో కీలక భాగం. మొత్తం 48 జట్ల మధ్య 871 మిలియన్ డాలర్లు పంచుతారు. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.8,299 కోట్లు. ఈ గణాంకాలు ఫుట్‌బాల్ ఆర్థిక శక్తిని చూపిస్తున్నాయి. ఇంత భారీ మొత్తాన్ని పంపిణీ చేయడం ఆటకు పెద్ద ఊతం. ప్రపంచవ్యాప్తంగా దీనిపై ఆసక్తి పెరుగుతోంది.



# బెన్ స్టోక్స్‌పై నిషేధం!

ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ చిక్కుల్లో పడ్డాడు. సహచర ఆటగాడు గస్ అట్కిన్సన్‌తో కలిసి ఫూటుగా మద్యం తాగి వీరంగం సృష్టించాడు. జట్టు నిబంధనలను ఉల్లంఘించి అర్ధరాత్రి తర్వాత క్లబ్‌కు వెళ్లిన ఈ ఇద్దరిపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) విచారణ చేపట్టింది. అయితే ఈ ఇద్దరు దోషులుగా తేలితే బోర్డు నిబంధనల ప్రకారం నిషేధం పడనుంది. లండన్‌లో న్యూజిలాండ్‌తో తొలి టెస్టు విజయానంతరం బెన్ స్టోక్స్, అట్కిన్సన్ అర్ధరాత్రి తర్వాత ఓ నైట్ క్లబ్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ సారాసెన్స్ అకాడమీకి చెందిన ఓ రగ్బీ ప్లేయర్‌తో గొడవ పడినట్లు బ్రిటిష్ మీడియా పేర్కొంది. అట్కిన్సన్‌పై ఆ ఆటగాడు చేయి చేసుకోగా.. అది పొరపాటున ఇంగ్లండ్ జట్టు భద్రతా సిబ్బందిలో ఒకరికి తగిలినట్లు తెలుస్తోంది. గాయపడిన సెక్యూరిటీ గార్డుకు అత్యవసర చికిత్స అందించారని, ఈ ఘర్షణలో స్టోక్స్, అట్కిన్సన్ దాడికి పాల్పడలేదని ఈసీబీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘటనను ఈసీబీ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ఘటనపై ఈసీబీ విచారణకు ఆదేశించింది. జూన్ 17 నుంచి న్యూజిలాండ్‌తో ఇంగ్లండ్ టెస్ట్ ఆడనుంది. ఈ మ్యాచ్‌కు ముందే బెన్ స్టోక్స్‌పై ఈసీబీ చర్యలు తీసుకునే అవకాశం ఉందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. స్టోక్స్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి కూడా తప్పించే అవకాశాలు ఉన్నట్లు బ్రిటీష్ మీడియా కోడై కూస్తోంది. స్టోక్స్‌పై వేటు పడితే.. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు.



# మ్యాచ్ మధ్యలో పీరియడ్స్: స్మృతి మంధాన

దేశం కోసం ఆడుతున్నప్పుడు పీరియడ్స్ నొప్పిని కూడా లెక్కచేయకుండా ఆటపై దృష్టి పెడతామని టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అన్నారు. పీరియడ్స్ సమయంలో తీవ్రమైన కడుపునొప్పి, నీరసం ఉన్నప్పటికీ దేశం కోసం మైదానంలో వంద శాతం శ్రమించాల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. మహిళల ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో స్మృతి మంధాన ఈ సున్నితమైన విషయంపై స్పందించారు. మహిళా అథ్లెట్లు మైదానంలో ఎంతటి మానసిక, శారీరక ఒత్తిడిని అధిగమించి రాణిస్తారో తెలియజేశారు. సాధారణ రోజుల్లోనే 50 ఓవర్ల మ్యాచ్ లేదా టీ20 మ్యాచ్ ఆడటం శారీరకంగా చాలా శ్రమతో కూడుకున్న పని. అలాంటిది పీరియడ్స్ సమయంలో మ్యాచ్ ఆడటం మరింత కష్టంగా ఉంటుంది. తీవ్రమైన కడుపునొప్పి, నీరసం ఉన్నప్పటికీ దేశం కోసం మైదానంలో వంద శాతం శ్రమించాల్సి ఉంటుంది. టెస్ట్ క్రికెట్ ఆడేటప్పుడు వైట్ జెర్సీ ధరించాల్సి ఉంటుంది. ఆ సమయంలో పీరియడ్స్ వస్తే.. బట్టలపై మరకలు పడతాయేమో అనే మానసిక ఆందోళన ప్రతి మహిళా క్రికెటర్‌లోనూ ఉంటుంది. ఆటపై దృష్టి పెట్టాలా లేక జెర్సీపై దృష్టి పెట్టాలా అనే గందరగోళం నెలకొంటుంది. కానీ ప్రొఫెషనల్ ప్లేయర్లుగా వాటన్నింటినీ తట్టుకుని ఆడక తప్పదు. మాకు పీరియడ్స్ ఉన్నాయని మేం మ్యాచ్‌లు ఆడకుండా ఇంట్లో కూర్చోలేం' అని స్మృతి మంధాన చెప్పుకొచ్చారు.

# పోర్చుగల్ జట్టు క్యాంప్ సమీపంలో భూకంపం!

## ఉలిక్కిపడ్డ రొనాల్డో సేన

ఫిఫా వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి మరికొద్ది రోజులు మాత్రమే సమయం ఉన్న తరుణంలో స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డోకు చెందిన పోర్చుగల్ జట్టు క్యాంప్ సమీపంలో భారీ భూకంపం సంభవించింది. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న ఈ శిక్షణ శిబిరానికి సమీపంలో ఒక్కసారిగా 6.1 తీవ్రతతో భూమి కంపించడంతో ఆటగాళ్లతో పాటు అక్కడి సహాయక సిబ్బంది అంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఓ వైపు ప్రతిష్టాత్మక ప్రపంచకప్ కోసం ముమ్మరంగా సన్నాహాలు జరుగుతున్న తరుణంలో ఈ ప్రకృతి విపత్తు ఒక్కసారిగా కలకలం రేపింది. అయితే ఈ ప్రమాదం నుంచి రొనాల్డోతో పాటు పోర్చుగల్ ఫుట్‌బాల్ జట్టు సభ్యులంతా సురక్షితంగా బయటపడటంతో అభిమానులు, క్రీడాలోకం ఊపిరి పీల్చుకుంది. ఈ భూకంప కేంద్రం పశ్చిమ క్యూబా సముద్ర గర్భంలో ఉన్నప్పటికీ.. దాని తీవ్రమైన ప్రకంపనలు సౌత్ ఫ్లోరిడా, మియామి, ఆర్లాండో వరకు స్పష్టంగా కనిపించాయి.



# ఉత్కంఠ పోరులో భారత్-ఏ విజయం!

ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ శుభారంభం చేసింది. శ్రీలంక-ఏ జట్టుతో మంగళవారం దంబుల్లా వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన తిలక్ వర్మ సారథ్యంలోని భారత్-ఏ జట్టు 8 పరుగుల తేడాతో గెలుపొందింది.రుతురాజ్ గైక్వాడ్(114 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 101) శతకంతో భారత్-ఏ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

కీలక వికెట్ తీసి అన్షుల్ కంబోజ్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్-ఏ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 277 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్(114 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగగా.. కెప్టెన్ తిలక్ వర్మ(97 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 60) హాఫ్ సెంచరీతో రాణించాడు. ప్రియాన్ష్ ఆర్య(32 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 32), సూర్యాన్ష్ షెడ్గే(14 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 26 నాటౌట్) పర్వాలేదనిపించారు.



విధ్వంసకర ఓపెనర్లు ప్రభ్ సిమ్రాన్ సింగ్(2), వైభవ్ సూర్యవంశీ(14)తో పాటు ఆయుష్ బదోని(24) తీవ్రంగా నిరాశపర్చారు. శ్రీలంక-ఏ బౌలర్లలో మహమ్మద్ షిరాజ్(2/67) రెండు వికెట్లు తీయగా.. చమిక కరుణరత్నే, గరుక సాంకేత్, వనుజా సాహన్ తలో వికెట్ తీసారు. అనంతరం శ్రీలంక-ఏ 48.5 ఓవర్లలో 269 పరుగులకు కుప్పకూలి ఓటమిపాలైంది. కెప్టెన్ సహన్ అరాచ్చిగే(72 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 74) హాఫ్ సెంచరీతో టాప్ స్కోరర్లుగా నిలవగా.. ఓపెనర్లు నిరోషన్ డిక్‌వెల్లా(45 బంతుల్లో 6 ఫోర్లతో 47), అవిష్కా ఫెర్నాండో(59 బంతుల్లో 7 ఫోర్లతో 45), సదీర సమరవిక్రమా(51 బంతుల్లో 4 ఫోర్లతో 46) పర్వాలేదనిపించారు. భారత్-ఏ బౌలర్లలో అర్షద్ ఖాన్, అనుకూల్ రాయ్, ఆయుష్ బదోని, విప్రజ్ నిగమ్, రెండేసి వికెట్లు తీయగా.. అన్షుల్ కంబోజ్ ఒక వికెట్ పడగొట్టాడు. ఓ దశలో శ్రీలంక-ఏ ఈ మ్యాచ్ గెలిపించేలా కనిపించింది. ఆ జట్టు విజయానికి చివరి 12 బంతుల్లో 10 పరుగులే అవసరమయ్యాయి. చేతిలో మూడు వికెట్లు ఉండటంతో శ్రీలంక-ఏ విజయం లాంఛనమేనని అనుకున్నారు. కానీ భారత బౌలర్లు 4 బంతుల వ్యవధిలోనే చివరి మూడు వికెట్లు తీసి చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నారు. శ్రీలంక-ఏ ఓపెనర్లు తొలి వికెట్‌కు 93 పరుగులు జోడించారు. ఆ తర్వాత వరుస ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయినా.. నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. ఐదో వికెట్ త్వరగానే పడినా..ఆరో వికెట్‌కు 42 పరుగులు.. ఏడో వికెట్‌కు 25 రన్స్ భాగస్వామ్యం నమోదైంది. 262/7 స్కోర్‌తో గెలుపు దిశగా సాగిన శ్రీలంక-ఏను భారత్-ఏ బౌలర్లు దెబ్బతీసారు. ఏడు పరుగుల వ్యవధిలోనే చివరి మూడు వికెట్లు తీసి ఆ జట్టు పతనాన్ని శాసించారు. కెప్టెన్ సహన్ అరాచ్చిగేను ఏడో వికెట్‌గా పెవిలియన్ చేర్చి అన్షుల్ కంబోజ్ మ్యాచ్ ఫలితాన్ని మార్చేసాడు. చివర్లో రుతురాజ్ గైక్వాడ్ చేసిన రనౌట్ కూడా భారత విజయానికి బాటలు వేసింది.

# సిరాజ్ ఔట్.. భువీకి నిరాశే!

ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత టీ20 జట్టులో కీలక మార్పు చోటు చేసుకుంది. అనూహ్యంగా ఈ సిరీస్‌ల నుంచి మహమ్మద్ సిరాజ్‌కు విశ్రాంతి కల్పించారు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. సిరాజ్ స్థానంలో ప్రసిధ్ కృష్ణను ఎంపిక చేశారు. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనకు మహమ్మద్ సిరాజ్ స్థానాన్ని ప్రసిధ్ కృష్ణతో భర్తీ చేశారు. బీసీసీఐ మెడికల్ టీమ్, టీమ్ మేనేజ్‌మెంట్‌తో చర్చల అనంతరం వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా మహమ్మద్ సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించారు.'అని బీసీసీఐ పేర్కొంది. దాంతో ఐపీఎల్ టాప్ పెర్ఫార్మర్, వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. బీసీసీఐ ఆటగాళ్ల ప్రదర్శన కంటే వయసుకే అత్యంత ప్రాధాన్యత ఇస్తుందనే విషయం మరోసారి స్పష్టమైంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భువనేశ్వర్ కుమార్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. 16 మ్యాచ్‌ల్లో 7.95 ఎకానమీతో 28 వికెట్లు తీసి ఆర్‌సీబీ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. మరే భారత పేసర్ కూడా భువనేశ్వర్ కుమార్‌లా రాణించలేదు. అయినా సెలెక్టర్లు భువనేశ్వర్‌ను పట్టించుకోవడం లేదు. ఐపీఎల్ 2026 ప్రదర్శనతోనే భువనేశ్వర్ కుమార్ టీమిండియాలోకి రీఎంట్రీ ఇస్తాడని అంతా అనుకున్నారు. కానీ సెలెక్టర్లు అతని పేరును కూడా పరిగణలోకి తీసుకోలేదు. జూన్ 26, 28 తేదీల్లో ఐర్లాండ్‌తో రెండు టీ20లు ఆడనున్న టీమిండియా.. జులై 1 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ రెండు సిరీస్‌ల్లో టీమిండియాను శ్రేయస్ అయ్యర్ నడిపించనున్నాడు. ఈ సిరీస్‌లతో భారత టీ20 క్రికెట్‌లో కొత్త అధ్యాయం మొదలవ్వనుంది. టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ కూడా ఈ సిరీస్‌లకు ఎంపికయ్యాడు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులోని ఐదుగురు ఆటగాళ్లు ఈ సిరీస్‌లకు ఉద్వాసనకు గురయ్యారు.

**ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(కీపర్), ఇషాన్ కిషన్(కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిధ్ కృష్ణ.

